RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 27 సెప్టెంబర్ 2026 ఆదివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:103

# మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కు "భారత రత్న" ఇవ్వాలి

### ఢిల్లీలో విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలి
### కేంద్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కలను నిజం చేసి ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ కు భారత రత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ ఢిల్లీలో విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా శనివారం హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లోని విప్రో సర్కిల్ లో ఆయన విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. కొన్ని సమయాల్లో రాజకీయాలకు అతీతంగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. మౌనమునిలా దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లిన గొప్ప వ్యక్తి మన్మోహన్ సింగ్ అని ముఖ్యమంత్రి కొనియాడారు. ఈ అంశాన్ని ఏఐసీసీ



అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళతామన్నారు. పార్లమెంటులో ఈ అంశాన్ని ప్రస్తావించాలని రాజ్యసభ సభ్యులకు సూచించారు. మన్మోహన్ సింగ్ జయంతి రోజున ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం ముఖ్యమంత్రిగా తనకు గర్వకారణమని తెలిపారు.

మిగతా 2 లో

# నవంబర్ రెండోవారంలో కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ

**2027 వర్షాకాలానికి ముందే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పనులు పూర్తి**
**అక్టోబర్ 5న సీడబ్ల్యూసీ సాంకేతిక పర్యవేక్షణ కమిటీ ముందుకు డిజైన్లు**
**భద్రత, నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు**
**జాతీయ సాంకేతిక సంస్థల సూచనల మేరకే పనులు**

హైదరాబాద్, సెప్టెంబర్ 26: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల సమగ్ర పునరుద్ధరణ పనులను నవంబర్ రెండోవారంలో ప్రారంభించి, 2027 వర్షాకాలానికి ముందే పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు.

మూడు బ్యారేజీల భద్రతను పటిష్టం చేయడంతోపాటు వాటి నిర్వహణ సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు అవసరమైన డిజైన్లను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసిందని తెలిపారు.

హైదరాబాద్ బేగంపేట లోకి కుందన్ బాగ్ లో ఉన్న తన అధికారిక క్యాంపు కార్యాలయంలో శనివారం నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో బ్యారేజీల పునరుద్ధరణ ప్రతిపాదనలపై మంత్రి సమీక్ష



నిర్వహించారు.

ప్రాజెక్టు డిజైనర్ రూపొందించిన పునరుద్ధరణ ప్రణాళికలో గ్రౌటింగ్ ద్వారా పునాదులను బలోపేతం చేయడం, స్టిల్లింగ్ బేసిన్లను పొడిగించడం, కొత్తగా కట్-ఆఫ్ వాల్స్ నిర్మించడం వంటి కీలక పనులు ఉన్నాయని మంత్రి తెలిపారు. వరద ప్రవాహ వేగాన్ని నియంత్రించే ఏర్పాట్లలో ఉన్న లోపాలను సరిచేయడంతోపాటు పునాదుల స్థిరత్వాన్ని పెంచడం, పునాదుల కింద నీటి చౌరబాటును అరికట్టడం ఈ పనుల ప్రధాన ఉద్దేశమని వివరించారు.

మిగతా4 లో

# హైదరాబాద్ జీపీఓ స్థాయిని తగ్గించొద్దు..

### కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానికి ఒవైసీ లేఖ

హైదరాబాద్ నగరానికి చారిత్రక వారసత్వంగా ఉన్న హైదరాబాద్ జనరల్ పోస్టాఫీస్ (జీపీఓ) హోదాను తగ్గించాలన్న ప్రతిపాదనను తాము వ్యతిరేకిస్తున్నట్టు ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. ఈ ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని కోరుతూ కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాలకు ఆయన శనివారం లేఖ రాశారు. హైదరాబాద్ జీపీఓను గ్రూప్ 'ఏ' నుంచి గ్రూప్ 'బీ'కి మార్చడంతో పాటు, హైదరాబాద్ సిటీ డివిజన్‌లో విలీనం చేయాలని ఇటీవల వచ్చిన ప్రతిపాదన సరికాదంటూ ఒవైసీ తన లేఖలో ప్రస్తావించారు. వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న ఈ సంస్థ హోదాను తగ్గించడం అన్యాయమని, ఏకపక్ష నిర్ణయమని ఆయన అభిప్రాయపడ్డారు. జీపీఓ ఉద్యోగుల నుంచి తనకు అందిన వినతిపత్రాన్ని కూడా ఈ లేఖకు జతపరిచినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా జీపీఓ ప్రాముఖ్యతను ఒవైసీ వివరించారు. "హైదరాబాద్ జీపీఓ అత్యధిక పనిభారం కలిగిన ముఖ్యమైన సంస్థ. హైదరాబాద్ హెడ్ పోస్టాఫీస్ పరిధిలోని మొత్తం మెయిల్ కార్యకలాపాల్లో జీపీఓ వాటా గణనీయంగా ఉంది. దీని డెలివరీ పరిధి కూడా నిరంతరం విస్తరిస్తోంది. అంతేకాకుండా, తెలంగాణ రాష్ట్రంలో ఏకైక ఫిలాటెలిక్ బ్యూరో (తపాలా స్టాంపుల సేకరణ, పోస్టల్ చరిత్ర పరిశోధన) ఇక్కడే ఉంది" అని ఆయన పేర్కొన్నారు.తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఈ చారిత్రక సంస్థకు మహానగరంలో ఎంతో ప్రాధాన్యత ఉందని, లక్షలాది మందికి తపాలా సేవలు అందిస్తోందని ఒవైసీ గుర్తుచేశారు. ప్రజల ప్రయోజనాలను, సంస్థ వారసత్వ గుర్తింపును దృష్టిలో ఉంచుకుని, కేంద్ర మంత్రులు ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జీపీఓ హోదా తగ్గింపు, విలీనం ప్రతిపాదనలను రద్దు చేసి, చీఫ్ పోస్ట్‌మాస్టర్ ఆధ్వర్యంలో స్వతంత్ర గ్రూప్ 'ఏ' సంస్థగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# పూరిగుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

### విడతల వారీగా ప్రతి అర్హ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు
### పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పేదవాడి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, పేదింటి ఆడబిడ్డ కుటుంబంలో చిరునవ్వు చూడాలన్న తపనతో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

శనివారం, జిల్లాకేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా గల ప్రెస్టన్ కళాశాల గ్రౌండ్ లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, జనగామ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి, జనగామ మున్సిపల్ ఛైర్పర్సన్ కడకంచి బాలమణి, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్, జనగామ మున్సిపల్ వైస్ ఛైర్మన్ బూష పర్వతాలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్, జనగామ, బనుక శివరాజ్ యాదవ్, డీసీసీ అధ్యక్షురాలు, జనగామ ఎల్. ధన్వంతి నాయక్, వైటీడీఏ సభ్యులు ఎల్. లక్ష్మీనారాయణ నాయక్ లతో కలిసి ముఖ్య అతిథిగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖల



మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి హాజరై, తెలంగాణ రాష్ట్ర గీతావళిని ఆలపించారు.

ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ.. సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేకపోయినా ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని పేదల గుమ్మానికి చేర్చే బాధ్యతతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

అదనంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త తెల్ల రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలను అమలు చేశామని తెలిపారు.

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు హాస్టళ్లలో డైట్ ఛార్జీలను 40 శాతం పెంచడంతో పాటు కాస్మోటిక్ ఛార్జీలను గణనీయంగా పెంచామని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ స్థాయి ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థలను నిర్మిస్తున్నామని వివరించారు.రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. వచ్చే దసరా నాటికి 2.18 లక్షల ఇళ్లు పూర్తి చేసే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

మిగతా 2 లో

### పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు

# ఎఐ టెక్నాలజీని వినియోగించుకోవాలి

**ప్రపంచ పటంలో రాష్ట్ర పర్యాటకానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలి**
**ఎఐ, డిజిటల్ టెక్నాలజీతో టూరిజం రంగానికి కొత్త ఊపు**
**పీపీపీ విధానంలో మౌలిక వసతులు, పెట్టుబడుల ప్రోత్సాహం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**
**శిల్పారామంలోని సాంప్రదాయ వేదికలో ప్రపంచ పర్యాటక దినోత్సవం--2026 వేడుకలు**
**హాజరైన డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**

తెలంగాణ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు డిజిటల్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI)లను విస్తృతంగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రకృతి, చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంపదకు నిలయమైన తెలంగాణను ప్రపంచ పర్యాటక పటంలో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. "డిజిటల్ అజెండా -- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యాటక రంగానికి కొత్త రూపు" అనే ఇతివృత్తంతో ప్రపంచ పర్యాటక దినోత్సవం--2026 వేడుకలు శనివారం శిల్పారామంలోని సంప్రదాయ వేదికలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు.




మిగతా 3 లో

# చాకలి ఐలమ్మ కు సీఎం రేవంత్ నివాళులు

హైదరాబాద్ దొరల పాలనను ధిక్కరించి, వెట్టి చాకిరి, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆ యోధురాలికి ఘనంగా నివాళులర్పించారు.అణగారిన వర్గాల హక్కుల కోసం నిర్భయంగా పోరాడిన చాకలి ఐలమ్మ గారు భూమి కోసం, భుక్తి కోసం, ఆత్మగౌరవం కోసం సాగిన పోరాటంలో చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. సామాజిక వివక్ష, దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం కేవలం ఒక వ్యక్తి పోరాటం కాదని, అణగారిన ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా, తెలంగాణ ప్రజా ఉద్యమ చరిత్రలో స్ఫూర్తిదాయకంగా నిలిచిందని గుర్తుచేసుకున్నారు.

### సిరిసిల్లపై సీఎం రేవంత్ ప్రత్యేక దృష్టి.. ఇక ప్రజా సమస్యలకు పరిష్కారం

**సీఎం రేవంత్ రెడ్డి సభను సమష్టిగా విజయవంతం చేయాలి - రాష్ట్ర మంత్రులు**

3 లో

# ప్రజాబలం

27 సెప్టెంబర్ 2026 ఆదివారం

## పూరిగుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి





మొదటి పేజీ తరువాయి

ప్రతి నియోజకవర్గానికి సమానంగా 3,500 ఇళ్లు మంజూరు చేశామని, జనగామ నియోజకవర్గానికి కూడా అదే విధంగా ఇళ్లు ఇచ్చామని తెలిపారు. లబ్ధిదారులు నిర్మాణ పనులు చేసిన దశలను బట్టి ప్రతి సోమవారం వారి ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేస్తున్నామని చెప్పారు.

రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామని, ప్రతి నియోజకవర్గానికి మరో 2,000 ఇళ్లు కేటాయించామని తెలిపారు. రాష్ట్రంలో పూరిగుడిసెలు లేకుండా చేయాలనే లక్ష్యంతో ముందుగా పూరిళ్లలో నివసిస్తున్న కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు.

జనగామ నియోజకవర్గంలో గుర్తించిన 500 పూరిళ్ల కుటుంబాలకు ఈ వేదికపై నుంచే రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. అసంపూర్తిగా నిలిచిపోయిన ఇందిరమ్మ ఇళ్లు, మొండిగోడలతో ఉన్న ఇళ్లు, స్లాబ్ స్థాయిలో ఆగిపోయిన ఇళ్లను కూల్చకుండా పూర్తి చేసుకునేందుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని కూడా రెండో విడతలో అమలు చేస్తున్నామని చెప్పారు.

మూడో విడత, నాలుగో విడతల్లో కూడా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గతంలో సేకరించిన ప్రభుత్వ ఇళ్ల స్థలాలను గుర్తించి, అర్హులైన పేదలకు పంపిణీ చేసి, తదుపరి విడతల్లో అక్కడ కూడా ఇళ్లు నిర్మించి ఇస్తామని తెలిపారు.

కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో మహిళా సంఘాలకు ఇప్పటివరకు రూ.70 వేల కోట్లకు పైగా సున్నా వడ్డీ రుణాలు అందించామని చెప్పారు.

గతంలో నిర్మాణం పూర్తికాని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నివాసయోగ్యంగా మార్చి, లబ్ధిదారులకు అందించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. జనగామలో ఇందుకు అవసరమైన రూ.2 కోట్లను వెంటనే మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. దసరా నాటికి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను నివాసయోగ్యంగా అందిస్తామని తెలిపారు.

జనగామ మున్సిపాలిటీలో మౌలిక వసతుల అభివృద్ధికి మొదటి విడతగా రూ.25 కోట్లు వెంటనే మంజూరు చేస్తామని, ఇప్పటికే శంకుస్థాపన చేసిన రూ.58--60 కోట్ల అభివృద్ధి పనులు, టెండర్లు పూర్తయిన రూ.19 కోట్ల పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు.

రైతు భరోసా పథకాన్ని కొనసాగిస్తున్నామని, వరి సాగు చేసిన రైతులకు మద్దతు ధరతో పాటు సన్నవడ్లకు బోనస్ అందిస్తున్నామని తెలిపారు.

నిరుద్యోగ యువత కోసం ఇప్పటికే 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని, మరో 14--15 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేశామని చెప్పారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత అని, అర్హులైన ఏ ఒక్క కుటుంబం కూడా ఇందిరమ్మ ఇల్లు విషయంలో నిరాశ చెందాల్సిన అవసరం లేదని, విడతల వారీగా ప్రతి అర్హ కుటుంబానికి ఇల్లు అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని మంత్రి స్పష్టం చేశారు.

ఈ నేపథ్యంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాపాలన ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకుందని, ఈ కాలంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా అనేక కార్యక్రమాలను అమలు చేసిందన్నారు.

ప్రజాపాలనలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ వంటి పలు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ఇంకా రాష్ట్రంలో పరిష్కరించాల్సిన సమస్యలు ఎన్నో ఉన్నాయని, వాటి పరిష్కార దిశగా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని చెప్పారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రివర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుంచి ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా ప్రజల కోసం పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అప్పుల భారం ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

తెలంగాణ రాష్ట్రం నీళ్లు, నిధులు, నియామకాల లక్ష్యంతో ఏర్పడిందని గుర్తు చేస్తూ, రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలనే ఉద్దేశంతోనే తెలంగాణ ఏర్పడిందన్నారు.

డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీలో అర్హులైన పేదలకే ఇళ్లు అందించాలన్నారు. అర్హత లేని వారు ఉంటే తొలగించి, నిజమైన అర్హులకు అవకాశం కల్పించాలన్నారు.

ఈ క్రమంలో జనగామ శాసనసభ్యులు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో జనగామ మున్సిపాలిటీ అత్యంత పురాతన మున్సిపాలిటీ అని పేర్కొంటూ, మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతులను మరింత మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు.

ఏడు నెలల క్రితం జనగామ మున్సిపాలిటీ పరిధిలో రూ.18.90 కోట్ల అభివృద్ధి పనులు మంజూరై టెండర్లు పూర్తయ్యాయని, ఆ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అదే విధంగా వడ్లకొండ--శామీర్‌పేట్ బైపాస్ రోడ్డును డబుల్ లైన్ చేయాలని కోరారు. అలాగే చీటకోడూరు బ్రిడ్జి నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయాలని, గండిరామారం పంపులను మరమ్మతులు చేసి, వినియోగంలోకి తీసుకురావాలన్నారు.

అలాగే రెండో దశలో అదనంగా మరిన్ని ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేసి, అందించాలన్నారు.

అనంతరం జనగామ మున్సిపల్ ఛైర్పర్సన్ మాట్లాడుతూ.. 2008 సంవత్సరం నుంచి తాగునీటి సరఫరా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న చీటకోడూరు డ్యామ్ పరిసర ప్రాంతాల ప్రజల సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, ఆయా ప్రాంతాలకు మంచినీటి సరఫరాను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రజలకు నిరంతర తాగునీరు అందించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు.

జనగామ మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, పలు వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఈ పనుల ద్వారా జనగామ మున్సిపాలిటీని అందరికీ ఆదర్శప్రాయమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. నిరుపేదల సొంత ఇంటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.

తదనంతరం 500 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందించారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీఓ గోపీరాం, మునిసిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి, ఇతర సంబంధిత అధికారులు, అన్ని మండలాల ఎంపిడిఓలు, తహసీల్దార్లు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రులకు అసలైన అగ్ని పరీక్ష

న్యూఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయం సేవా తీర్థ్ వేదికగా కేంద్ర మంత్రులందరితో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పాటు నిర్వహించిన ఉన్నత స్థాయి మేధోమథన సదస్సు హాట్ టాపిక్ అయింది. ఎన్డీయే-3 ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పూర్తి స్థాయి మంత్రుల మండలితో ప్రధాని ఇంతటి సుదీర్ఘ అంతర్గత సమీక్ష నిర్వహించడం ఇదే ప్రథమం. కేవలం విధానపరమైన నిర్ణయాలకే పరిమితం కాకుండా.. గత కొన్ని నెలలుగా వివిధ మంత్రిత్వ శాఖల పనితీరు, ప్రజా సమస్యల పరిష్కారంలో చూపిస్తున్న వేగం, వికసిత్ భారత్ రోడ్‌మ్యాప్ అమలుపై మోదీ లోతుగా సమీక్షించారు. కేంద్ర మంత్రులను ఎనిమిది ప్రత్యేక బృందాలుగా విభజించి, ప్రతి గ్రూపుతో విడివిడిగా సంభాషిస్తూ క్షేత్రస్థాయి ఫలితాలు ఎలా ఉన్నాయో కూలంకషంగా ఆరా తీశారురెండు రోజుల మేధోమథన సదస్సు ప్రధానంగా పరిపాలనా సంస్కరణలు, ప్రజా సంక్షేమ పథకాల డెలివరీ మెకానిజం చుట్టూనే తిరిగింది. బ్యూరోక్రసీపై పూర్తిగా ఆధారపడటం మానుకోవాలని, మంత్రులు స్వయంగా ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించాలని మోదీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. యువత, మహిళలకు ఉద్దేశించిన కేంద్ర ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయికి ఎంతవరకు చేరుతున్నాయన్న దానిపై గ్రౌండ్ రిపోర్టులు తెప్పించుకుని పరిశీలించారు. శాఖల మధ్య సమన్వయ లోపం ఉండకూడదని, ఫైళ్ల క్లియరెన్స్‌లో జాప్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. తాజా సమీక్షలో పలువురు మంత్రుల పనితీరు ఆశాజనకంగా లేదని తేలడంతో పాటు, కొందరి పోర్ట్‌ఫోలియోల్లో ఆశించిన వేగం కనిపించలేదన్న నివేదికలను ప్రధాని నేరుగా వారి ముందే ఉంచినట్లు సమాచారం.ఈ భారీ కసరత్తు పూర్తవడంతో కేంద్ర కేబినెట్‌లో ఎవరిని ఉంచాలి? ఎవరిని సాగనంపాలి? అనే అంశంపై ప్రధాని మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ నాయకత్వానికి ఒక స్పష్టమైన క్లారిటీ వచ్చినట్లు చెబుతున్నారు. గత ఎన్నికల తర్వాత కూటమి భాగస్వామ్యాల లెక్కలతో ఏర్పడిన మంత్రివర్గంలో కొందరికి అదనపు బాధ్యతలు ఉండగా, మరికొందరు ఆశించిన స్థాయి పనితీరును కనబరచలేకపోయారు. రాబోయే పలు కీలక రాష్ట్రాల శాసనసభ ఎన్నికల సమీకరణాలు, సామాజిక సమతుల్యత, పాలనా సామర్థ్యమే గీటురాయిగా మంత్రుల ర్యాంకింగ్‌లు, రిపోర్ట్ కార్డులను సిద్ధం చేశారు. ఆశించిన ఫలితాలు ఇవ్వని పలువురు మంత్రులను కేబినెట్ నుంచి తప్పించి పార్టీ సంస్థాగత బాధ్యతలకు పరిమితం చేయవచ్చని తెలుస్తోందికేంద్ర మంత్రివర్గంలో పెను మార్పులు, చేర్పులు త్వరలోనే ఉండబోతున్నాయన్న సంకేతాలు బలంగా కనిపిస్తున్నాయి. దాదాపు 15 నుంచి 17 కొత్త ముఖాలకు కేబినెట్ లేదా సహాయ మంత్రుల హోదాలో చోటు కల్పించవచ్చని, యువ నాయకత్వానికి ప్రాధాన్యత ఇస్తూనే పనితీరు బాగున్న కొందరు సహాయ మంత్రులకు పదోన్నతులు కల్పించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. సంస్కరణల అమలు, వికసిత్ భారత్-2047 ప్లాన్ అమలుపై సమీక్ష నిర్వహించి,, కీలక నిర్ణయాలు తీసుకునేందుకు ఈ చింతన్ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. అలాగే జాతీయ స్దాయిలో తాజా రాజకీయ పరిణామాలు, మంత్రుల పనితీరు సమీక్ష, భవిష్యత్ ప్రణాళికలు రూపొందించడం, ప్రభుత్వ ప్రాధాన్యతలు మార్చుకోవడంపై ఫోకస్ చేసే అవకాశం ఉంది. మరోవైపు విజన్-2047 స్వల్పకాలిక, దీర్ఘకాలిక రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేయడానికి రంగాల వారీగా 10 కార్యదర్శుల బృందాలను ఇప్పటికే ఏర్పాటు చేసిన ప్రధాని మోడీ.. వాటిపై ఇవాళ మరోసారి ప్రజంటేషన్లు తీసుకునే అవకాశం ఉంది. అలాగే జంతర్ మంతర్ ఆందోళనల తర్వాత మంత్రుల పనితీరుపై ప్రధాని మోడీ రెగ్యులర్ గా సమీక్షలు నిర్వహిస్తున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండాలని కోరుతున్నారు. అంతే కాదు వీటిపైనా నివేదికలు తెప్పించుకుంటున్నారు. తాను కూడా స్వయంగా సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. తాజా నివేదికల ఆధారంగా మంత్రుల పనితీరును ప్రధాని కొలవబోతున్నారు. అలాగే దీంతో పాటు రాబోయే రోజుల్లో మరిన్ని చింతన్ శిబిర్ లు కూడా ఏర్పాటు చేస్తామని సంకేతాలు ఇస్తున్నారు. ఇవన్నీ అంతిమంగా కేబినెట్ లో మార్పులపై మంత్రుల్లో వస్తున్న వ్యతిరేకతను వాడుకుంటూ ప్రక్షాళనకు ప్రధాని దారులు తెరుస్తారనే చర్చ కూడా జరుగుతోంది. అదే జరిగితే త్వరలో చేపట్టే కేబినెట్ ప్రక్షాళనపై చింతన్ శిబిర్ రిపోర్టుల ప్రభావం కూడా ఉండబోతోంది. సమయంలో కీలక భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జేడీయూలతో పాటు ఇతర ఎన్డీయే మిత్రులకు ప్రాతినిధ్యం పెంచడం లేదా అదనపు శాఖలు కేటాయించే కసరత్తు కూడా కొలిక్కి వచ్చినట్లు సమాచారం. ఈ చింతన్ శిబిర్ కేవలం సమీక్ష మాత్రమే కాదని, మోదీ మార్క్ నిర్దాక్షిణ్య ప్రక్షాళనకు వేసిన బలమైన పునాది అని గట్టిగానే గుసగుసలు వినిపిస్తున్నాయి.

## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కు "భారత రత్న" ఇవ్వాలి




మొదటి పేజీ తరువాయి

భారత దేశం గర్వించదగ్గ జాతిరత్నం

భారత దేశం గర్వించదగ్గ జాతిరత్నం మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. వారి స్ఫూర్తిని భావితరాలకు అందించాలన్న సంకల్పంతోనే ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించుకున్నట్లు తెలిపారు. రిజర్వు బ్యాంకు గవర్నర్ గా, ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా ఏ పదవి చేపట్టినా ఆ పదవులకు ఆయన వన్నె తెచ్చారన్నారు. 1991 లో దివంగత ప్రధాని పీవీ నర్సింహారావు హయాంలో ఆర్థిక మంత్రిగా మన్మోహన్ సింగ్ పనిచేశారని, అప్పుడు ఆయన తీసుకువచ్చిన సంస్కరణలే దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి కోలుకునేలా చేశాయని గుర్తు చేశారు. లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ విధానాలు తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి మన్మోహన్ సింగ్ అని సీఎం తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన సంస్థలు హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచి సేవలు అందిస్తున్నాయని, అలాంటి ప్రాంతంలో మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం సముచితం అని భావించామని ముఖ్యమంత్రి చెప్పారు.

తెలంగాణ చరిత్రలో చెరగని ముద్ర నెహ్రూ-పటేల్, సోనియా-మన్మోహన్ చరిత్రలో తెలంగాణను రెండు భాగాలుగా చూస్తుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆనాడు హైదరాబాద్ సంస్థానాన్ని భారత్ లో కలిపి స్వాతంత్ర్యం అందించిన ఘనత తొలి ప్రధాని నెహ్రూ, వల్లభాయ్ పటేల్ ది అయితే... దశాబ్దాల తెలంగాణ కలను సాకారం చేసిన ఘనత సోనియా గాంధీ, ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ది అని సీఎం గుర్తు చేశారు. అందుకే తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తూ ఆయన చేసిన సంతకాన్ని ఇక్కడ పదిలపరిచామని సీఎం తెలిపారు. మన్మోహన్ సింగ్ ఎన్నో సరళీకృత విధానాలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. విద్యా హక్కు చట్టం, జాతీయ ఉపాధి హామీ చట్టం, భూసేకరణ, పునరావాస చట్టం 2013 తీసుకొచ్చిన ఘనత సోనియా, మన్మోహన్ సింగ్ ఘనత అని తెలిపారు. భూమి కలిగిన వారితో పాటు భూమిలేని పేదలకు కూడా నష్టపరిహారం ఇవ్వాలని పునరావాస చట్టం ద్వారా హక్కు కల్పించడం గొప్ప విషయమన్నారు. పేదల కోసం ఆయన చేసిన ఆలోచనలు, తీసుకువచ్చిన సంస్కరణలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, మాజీ ఆర్థిక సలహాదారు మోహన్ గురుస్వామి, మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, నవీన్ యాదవ్, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తిరువూరు లో ప్రైవేటు ఆసుపత్రి సీజ్

విజయవాడ తిరువూరు 'ఎంవిఎస్ నర్సింగ్ హోమ్ ను అధికారులు ' సీజ్ చేసారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు వైద్యం చేయొద్దని ఉత్తర్వులు ఇచ్చారు. ఎంవిఎస్ ఓ‌మా సర్జికల్ అండ్ మెటర్నిటీ నర్సింగ్ హోమ్లో మహిళ మృతి చెందింది. దీప్తి అనే యువతి డెలివరీ తర్వాత మృతిచెందింది. డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమంటూ దీప్తి కుటుంబ సభ్యుల ఆరోపణ. వారం రోజుల క్రితం ఇదే ఆస్పత్రిలో ఆపరేషన్ వికటించి మరో మహిళ మృతి చెందింది. దాంతో అధికారులు రంగంలోకి దిగి ఆసుపత్రిని సీజ్ చేసారు.

# సిరిసిల్లపై సీఎం రేవంత్ ప్రత్యేక దృష్టి.. ఇక ప్రజా సమస్యలకు పరిష్కారం

## సీఎం రేవంత్ రెడ్డి సభను సమష్టిగా విజయవంతం చేయాలి - రాష్ట్ర మంత్రులు







**రాజన్న సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ 26 ,( ప్రజాబలం ప్రతినిధి )**సిరిసిల్ల అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, ఈ నెల సెప్టెంబర్ 30న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సీఎం భారీ బహిరంగ సభను కాంగ్రెస్ శ్రేణులంతా సమష్టిగా కృషి చేసి విజయవంతం చేయాలని రాష్ట్ర మంత్రులు పిలుపునిచ్చారు. శనివారం సిరిసిల్లలోని మణికంఠ గార్డెన్స్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశానికి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, విజయరమణారావు, వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా, సిరిసిల్ల ఇన్‌ఛార్జ్ కేకే మహేందర్ రెడ్డి హాజరయ్యారు.

**అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పట్టుదల కలిగిన నాయకుడు, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కోరిక మేరకు జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సిరిసిల్ల నేతన్నలకు యారన్ డిపో ఏర్పాటుతో పాటు రుణభారాన్ని తగ్గించే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలన్నది సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్ష అని, ఈ సభ రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారేలా ప్రతి కార్యకర్త శ్రమించాలని కోరారు.

**రూ. 1,000 కోట్లతో అభివృద్ధి పనులు: మంత్రి శ్రీధర్ బాబు**

మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిరిసిల్ల నియోజకవర్గంలో దాదాపు రూ. 1,000 కోట్లతో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం వంటి సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందుతున్నాయన్నారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని స్పష్టం చేశారు.



**ఉత్తర తెలంగాణ నుంచి 'చలో సిరిసిల్ల' – మంత్రి పొన్నం ప్రభాకర్**

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 30న సీఎం రేవంత్ రెడ్డి కరీంనగర్‌లో నూతన కలెక్టరేట్, తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ అనంతరం సిరిసిల్లకు చేరుకుని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారని తెలిపారు. 'చలో సిరిసిల్ల' పిలుపుతో ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

**కార్యకర్తలంతా ఐక్యంగా ముందుకు సాగాలి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

ప్రజాపాలనలో అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి భారీ స్థాయిలో జనసమీకరణ చేసి సభను ఘన విజయం చేయాలని కోరారు.

**గులాబీ గుండెల్లో గుబులు: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాజన్న ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ఇప్పటికే రూ. 250 కోట్లు మంజూరు చేసిందని, సిరిసిల్లలో రూ. 200 కోట్లతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్' ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి సభకు దాదాపు వెయ్యి బస్సుల ద్వారా లక్ష మందిని సమీకరిస్తున్నామని, సీఎం సభ వార్తతో ప్రతిపక్షాల్లో గుబులు మొదలైందని పేర్కొన్నారు.

అనంతరం మంత్రుల బృందం బహిరంగ సభ నిర్వహించే ప్రాంగణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు, నిర్వాహకులకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ఎఐ టెక్నాలజీని వినియోగించుకోవాలి




మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఈ ఏడాది పర్యాటక దినోత్సవ ఇతివృత్తమైన "డిజిటల్ అజెండా -- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యాటక రంగానికి కొత్త రూపు" ప్రాధాన్యతను వివరిస్తూ, ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా మన పర్యాటక రంగాన్ని పునర్నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర పర్యాటకాన్ని గ్లోబల్ వేదికపై ఆవిష్కరించే నూతన వెబ్‌సైట్‌ను, అద్భుత చిత్రాలతో రూపొందించిన కాఫీ టేబుల్ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. రాష్ట్రంలో హెల్త్, ఆలయ, గ్రామీణ, ప్రకృతి పర్యాటక రంగాలకు అపారమైన అవకాశాలున్నాయని భట్టి విక్రమార్క తెలిపారు. వికారాబాద్‌లో వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటు పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని గుర్తుచేశారు. టైగర్ రిజర్వులు, అడవులు, జలపాతాలు, ప్రాచీన ఆలయాలు, నగరంలోని చారిత్రక కట్టడాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని, ప్రశాంతతను కోరుకునే వారికి తెలంగాణ సరైన వేదిక అని పేర్కొన్నారు. వీటిని అంతర్జాతీయంగా సరైన రీతిలో మార్కెటింగ్ చేయాలని అధికారులకు సూచించారు.

**పీపీపీ విధానంలో ప్రాజెక్టులు, బడ్జెట్ పెంపు:**

గతంతో పోలిస్తే ఈసారి పర్యాటక రంగానికి బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. సందర్శకుల భద్రత, నాణ్యమైన వసతులకు తమ పాలసీలో పెద్దపీట వేసినట్లు చెప్పారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (PPP) పద్ధతిలో అంతర్జాతీయ స్థాయి హోటళ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి, భారీగా పెట్టుబడులను ఆకర్షించాలని స్పష్టం చేశారు.

వారంలో ఐదు రోజులు తీవ్ర ఒత్తిడితో పనిచేసే హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను పర్యాటకం వైపు మళ్లించేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఇందుకోసం పర్యాటక శాఖ మంత్రి, కార్యదర్శి కలిసి ప్రముఖ ఐటీ కంపెనీల సీఈఓలు, పర్యాటక ప్రాజెక్టుల నిర్వాహకులతో త్వరలోనే సమావేశం కావాలని ఆదేశించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు 'టూరిజం కూపన్లు' అందించి వారాంతాల్లో తెలంగాణలోని ప్రకృతి ప్రాంతాలను సందర్శించేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. పర్యాటకం అనేది కేవలం వినోదం మాత్రమే కాదని, విభిన్న సంస్కృతుల సమ్మేళనానికి అద్దం పడుతుందని డిప్యూటీ సీఎం అభిప్రాయపడ్డారు. పర్యాటక శాఖ చేపడుతున్న నూతన కార్యక్రమాలను అభినందిస్తూ, తెలంగాణ పర్యాటక కీర్తి ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాలని ఆకాంక్షించారు.

తెలంగాణ పర్యాటక శాఖకు సంబంధించిన పలు నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

పునర్ రూపకల్పన (రీడిజైన్) చేసిన తెలంగాణ టూరిజం వెబ్‌సైట్, ఆన్‌లైన్ హోమ్‌స్టే రిజిస్ట్రేషన్ విధానం, కొత్త టూరిజం ట్రైలర్లు, ఇంటరాక్టివ్ AR/VR ఆధారిత లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, తెలంగాణ పర్యాటక ప్రాంతాలపై కాఫీ టేబుల్ బుక్, »»My Telangana, My Story, My Destination" అంశంపై వీడియో/పోస్టర్, ఎకో టూరిజంపై వీడియో ను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ASI) సూపరింటెండెంట్ నిఖిల్ దాస్, పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ పురావస్తు శాఖ మధ్య అవగాహన ఒప్పందం (MoU) కుదుర్చుకున్నారు.

"ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ అండ్ డిజిటల్ టెక్నాలజీ -- ది ఫ్యూచర్ ఆఫ్ టూరిజం", ఎకో టూరిజం, ఫిల్మ్ టూరిజం, స్పోర్ట్స్ టూరిజం, హెరిటేజ్ టూరిజం తదితర రంగాల్లో వస్తున్న మార్పులు, అవకాశాలపై అంశంపై ప్యానెల్ చర్చ జరిగింది. ఈ సదస్సులో యువ టూరిజం క్లబ్‌ల విద్యార్థులు, టూరిస్ట్ పోలీస్, తెలంగాణ దర్శిని, శిక్షణ పొందిన గైడ్స్ , హోమ్‌స్టే పై పలువురు తమ అనుభవాలను పంచుకున్నారు. తర్వాత ఎక్సలెన్స్ అవార్డులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

శిల్పారామంలోని సాంప్రదాయ వేదిక లో ఘనంగా ప్రారంభమైన ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు హాజరైన ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

ఈ వేడుకల్లో పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ గౌతమి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, టీజీపీ డైరెక్టర్ లక్ష్మి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, సాహిత్య అకాడమీ సెక్రటరీ బాలాచారి, సినీ నటులు తిరువరూర్, ఫరియా అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

## కొత్త జెన్ జీ ఓటర్లు....మూడు కోట్ల మంది

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26, (న్యూస్ పల్స్) కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) 2025లో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియను ప్రారంభించినప్పటి నుంచి 18 నుంచి 28 ఏళ్ల వయస్సు గల ( కేటగిరీకి చెందిన దాదాపు 2.73 కోట్ల మంది కొత్తగా ఓటర్ల జాబితాలో చేరినట్లు అధికారులు వెల్లడించారు. వార్షిక సమగ్ర సమీక్ష నిర్వహించకపోవడం వల్ల యువ ఓటర్ల నమోదు నిలిచిపోయిందంటూ వస్తున్న కథనాల నడుమ ఈ గణాంకాలు వెలువడ్డాయి. అయితే, ఈ ప్రచారానని ఈసీ అధికారులు ఖండించారు. వార్షిక సమీక్షతో సంబంధం లేకుండా అర్హులైన పౌరులు నిరంతరం తమ పేర్లను నమోదు చేసుకునేందుకు 'సబ్‌స్క్రిప్షన్ పద్ధతి/ కంటిన్యూ అప్‌డేట్' అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. ఈ 2.73 కోట్లలో తొలిసారి ఓటు హక్కు పొందిన వారితో పాటు, ఇప్పటికే అర్హత ఉండి ఇటీవల జాబితాలో చేరిన లేదా వివరాలను అప్‌డేట్ చేసుకున్న 18–28 ఏళ్ల మధ్య యువకులు కూడా ఉన్నారని తెలిపారు. "ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950, సెక్షన్ 14లో 2021లో చేసిన సవరణ ప్రకారం ఓటర్ల జాబితాలో పేరు లేనివారు లేదా జనవరి 1, ఏప్రిల్ 1, జులై 1, అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి పౌరుడూ ఎలాంటి సమీక్ష ప్రక్రియ కోసం వేచి చూడాల్సిన అవసరం లేకుండానే నిరంతర అప్‌డేట్ విధానం ద్వారా పేరు నమోదు చేసుకోవచ్చు. స్పెషల్ సమరీ రివిజన్ , స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ రెండూ సెక్షన్ 21(3) కింద చేపట్టే ఆప్షన్ ప్రక్రియలు మాత్రమే.

ఈ రెండింటినీ ఒకేసారి నిర్వహించాలనే చట్టబద్ధమైన నిబంధనేదీ లేదు" అని అధికారులు వివరించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 14(బీ)కి చేసిన సవరణ తర్వాత ఈ నాలుగు అర్హత తేదీలను అందుబాటులోకి తెచ్చారు. ఈ నాలుగు తేదీలలో ఏ రోజైనా 18 ఏళ్లు పూర్తి చేసుకునే పౌరులు ముందుగానే 'ఫారం 6' ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారుడికి అర్హత వయస్సు వచ్చే త్రైమాసికంలో ఆ దరఖాస్తును పరిశీలిస్తారు.తుది ఓటర్ల జాబితా ప్రచురణ తర్వాత కూడా నిరంతర అప్‌డేట్ ప్రక్రియ కొనసాగుతుందని, కాబట్టి తదుపరి సమీక్ష వరకు ఆగాల్సిన పనిలేదని ఎన్నికల సంఘం తెలిపింది. కొత్త ఓటరు నమోదు కోసం 'ఫారం 6'ను కేటాయించారు.బిహార్‌లోని ఎస్ఐఆర్ ప్రక్రియ తర్వాత నవంబర్ 2025లో అక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అలాగే ఈ ఏడాది అసోం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరిలలో కూడా ఓటర్ల జాబితా సవరణ పూర్తి చేసి అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించారు. ఎస్ఐఆర్, ఎస్ఎస్ఆర్, నిరంతర అప్‌డేట్ అనేవి వేర్వేరు ప్రక్రియలని ఈసీ స్పష్టం చేసింది. ఎస్ఐఆర్ సమయంలోనూ 18–28 ఏళ్ల వయస్సు వారిలో 2.73 కోట్ల మంది కొత్తగా చేరడం యువ ఓటర్ల నమోదు ఆగిపోలేదనడానికి నిదర్శనమని అధికారులు పేర్కొన్నారు.

# నవంబర్ రెండోవారంలో కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ

## - మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ)తోపాటు ఇతర నిపుణుల కమిటీలు వ్యక్తం చేసిన అభ్యంతరాలు, సూచనలను పరిగణనలోకి తీసుకొని పునరుద్ధరణ ప్రణాళికను రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు.

"బ్యారేజీల నిర్మాణ భద్రత, పునరుద్ధరణ పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. శాస్త్రీయ అధ్యయనాలు, జాతీయ స్థాయి సాంకేతిక సంస్థల సిఫార్సుల ఆధారంగానే ప్రతి పని జరుగుతుంది" అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.

ప్రతిపాదిత డిజైన్లను పుణేలోని కేంద్ర జల, విద్యుత్ పరిశోధనా కేంద్రం (సీడబ్ల్యూపీఆర్ఎస్)లో కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ నమూనాల ద్వారా పరీక్షిస్తున్నట్లు తెలిపారు. వివిధ స్థాయిల్లో వరద ప్రవాహం ఉన్నప్పుడు బ్యారేజీల వద్ద నీటి ప్రవాహ తీరు ఎలా ఉంటుందో, ప్రతిపాదించిన చర్యలు ఎంత సమర్థంగా పనిచేస్తాయో ఈ పరీక్షల ద్వారా నిర్ధారిస్తారని చెప్పారు.ఖరారు చేసిన డిజైన్లను అక్టోబర్ 5న న్యూఢిల్లీలో కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలోని సాంకేతిక పర్యవేక్షణ కమిటీ ముందు ఉంచనున్నట్లు మంత్రి వెల్లడించారు.

కమిటీ నిపుణులు వాటిని పరిశీలించి అవసరమైన సూచనలు, సిఫార్సులు చేస్తారని తెలిపారు.

సాంకేతిక అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను ఏకకాలంలో పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పునరుద్ధరణ పనులకు సంబంధించిన సమగ్ర వ్యయ అంచనాలను నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ సిద్ధం చేస్తోందని చెప్పారు. ప్రభుత్వ అనుమతి కోసం అవసరమైన కాంట్రాక్టు విధానాన్ని కూడా ఖరారు చేస్తున్నట్లు తెలిపారు.

డిజైన్లకు అనుమతి లభించిన వెంటనే టెండర్లను పిలిచి, పనులను అప్పగించేలా మొత్తం ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పనుల అమలులో కఠినమైన నాణ్యతా ప్రమాణాలు, స్వతంత్ర పరీక్షలు, స్పష్టమైన కాలపరిమితులు ఉండాలని ఆదేశించారు. నిర్ణీత గడువులో పనులు పూర్తయ్యేలా ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా, సాంకేతికంగా పటిష్టమైన, దీర్ఘకాలం మన్నే విధానాలతో మూడు బ్యారేజీలను పునరుద్ధరించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

"పునరుద్ధరణ పనులు పూర్తయి, జాతీయ సాంకేతిక సంస్థల నుంచి అవసరమైన భద్రతా అనుమతులు వచ్చిన తర్వాతే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తిరిగి నిర్వహణలోకి తీసుకొస్తాం" అని మంత్రి తేల్చిచెప్పారు.డిజైన్ల పరిశీలన నుంచి టెండర్లు, పనుల అమలు, తుది భద్రతా ధ్రువీకరణ వరకు ప్రతి దశను పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్‌డీఎస్‌ఏ ఆదేశాలను పూర్తిస్థాయిలో పాటిస్తూ, ప్రతి దశను నిపుణుల పరిశీలనకు లోబడి నిర్వహించాలని అధికారులకు సూచించారు.

ఈ సమీక్షలో నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు, కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ కార్యక్రమంతో సంబంధం ఉన్న ఇంజినీర్లు పాల్గొన్నారు.

# ఏటీఎంలలో దుర్గమ్మ ప్రసాదం



విజయవాడ, సెప్టెంబర్ 26 రాష్ట్రంలో మొదటిసారిగా దుర్గమ్మ దేవస్థానంలో ప్రసాదం ఏటీఎంను ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకొచ్చారు. భక్తులు ప్రసాదం కౌంటర్ల వద్ద గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే శ్రమ లేకుండా లడ్డూ ప్రసాదాన్ని పొందేందుకు ఈ ఆధునిక సాంకేతికత ఎంతో దోహదపడుతుందన్నారు దేవాదాయశాఖ కమిషనర్ శ్రీ రామచంద్ర మోహన్. జఖఎ ద్వారా డిజిటల్ చెల్లింపులు జరిపి క్షణాల్లో ప్రసాదం పొందేలా రూపొందించారు. ప్రస్తుతం ట్రయల్ రన్ గా ఏర్పాటు చేశామని..పనితీరు పరిశీలించిన తర్వాత భక్తుల రద్దీ అధికంగా ఉండే ఇతర ప్రాంతాల్లోనూ మరిన్ని యంత్రాలు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తాం అన్నారు. ఉత్సవాల రద్దీ సమయంలోనే కాదు సాధారణ రోజుల్లోనూ సులువుగా లడ్డూ ప్రసాదం పొందొచ్చన్నారు. మరోవైపు ఫేక్ పూజా టికెట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు దేవాదాయశాఖ కమిషనర్ శ్రీ కె. రామచంద్ర మోహన్. దేవాలయ దర్శనాలు, సేవల పేరిట దళారుల ప్రమేయాన్ని ఉపేక్షించేది లేదన్నారు. విజయవాడలో ఇటీవల వెలుగుచూసిన ఫేక్ పూజా టికెట్ల వ్యవహారంపై దేవస్థానం అధికార యంత్రాంగం తక్షణమే అప్రమత్తమై పోలీసులకు ఫిర్యాదు చేసిందని, బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆలయ సేవలను కేవలం ప్రభుత్వం, దేవస్థానం అధికారికంగా ఏర్పాటు చేసిన వెబ్‌సైట్లు, డిజిటల్ యాప్‌లు , అధీకృత కౌంటర్ల ద్వారా మాత్రమే పొందాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని పారదర్శకంగా సేవా టికెట్లు పొందాలని, ద ళ ా ం ు ల న ు ప్రోత్సహించవద్దన్నార.ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు దేవాదాయశాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. సామాన్య భక్తునికే అగ్రస్థానం కల్పించే దిశగా ప్రతి విభాగం సమన్వయంతో పనిచేస్తోందని పేర్కొన్నారు. రద్దీ నియంత్రణ, క్యూలైన్ల నిర్వహణ, తాగునీరు, ప్రసాద వితరణ, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎండ, వర్షాల బారిన పడకుండా షెడ్ల నిర్మాణం, నిరంతర పర్యవేక్షణకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా దర్శనం చేసుకుని వెళ్లేలా ప్రణాళికలు రూపొందించామని, ఉత్సవాలను విజయవంతం చేసేందుకు భక్తులందరూ అధికార యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని కోరారు.


# అంబటి రాంబాబును వెంటాడుతున్న ఈడీ..!

గుంటూరు సెప్టెంబర్ 26 వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏపీ మద్యం రవాణా టెండర్ల కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తును మరింత వేగవంతం చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు ఈడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్‌లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరు కావాలని అధికారులు ఆయనకు స్పష్టం చేశారు.మద్యం రవాణా కేసులో అంబటి రాంబాబును విచారణ సెగ గట్టిగానే వెంటాడుతోంది. ఈ వ్యవహారంలో ఈడీ అధికారులు ఇప్పటివరకు ఆయనకు రెండుసార్లు నోటీసులు జారీ చేశారు. మొదటగా సెప్టెంబర్ 18న అంబటి రాంబాబుకు తొలిసారిగా ఈడీ నోటీసులు వెళ్లాయి. సెప్టెంబర్ 24న తమ ముందు హాజరుకావాలని అధికారులు అందులో పేర్కొన్నారు. అయితే ఆ సమయంలో తాను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నానని, పాత తేదీలతో ఉన్న నోటీసులు పంపారంటూ అంబటి రాంబాబు పేర్కొన్నారు.చట్టపరమైన సలహా తీసుకునేందుకు వీలుగా తనకు కొత్త నోటీసు ఇవ్వాలని ఆయన కోరారు. అంబటి రాంబాబు అభ్యర్థన మరియు మునుపటి గడువు ముగిసిన నేపథ్యంలో, ఈడీ అధికారులు సెప్టెంబర్ 24న మరోసారి నోటీసులు జారీ చేశారు. సెప్టెంబర్ 25న ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అధికారులు స్పష్టం చేశారు. మద్యం డిపోల నుండి



షాపులకు మద్యం రవాణా చేసే కాంట్రాక్టును దక్కించుకున్న కొంతమంది వైఎస్సార్‌సీపీ నేతలతో మాజీ మంత్రికి అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు వచ్చాయి.ఒకవేళ విచారణ పేరిట ఈడీ కఠిన చర్యలు తీసుకోవడం గానీ, అరెస్టు చేయడం గానీ చేస్తే.. దాన్ని రాజకీయ కక్షసాధింపుగా చిత్రీకరించి విక్టిమ్ కార్డ్ ఉపయోగించాలనేది ఆయన ఆలోచనగా కనిపిస్తోంది. కేంద్రంలో ఉన్న పవర్, విచారణ సంస్థల వద్ద లభించిన దస్త్రాల ఆధారంగా చట్టపరంగా ముందుకెళుతున్న ఈడీపై ఇలా రాజకీయ రంగు పూయడం ద్వారా కేసు తీవ్రతను తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే, రాజ్యాంగబద్ధమైన కేంద్ర దర్యాప్తు సంస్థల పనితీరును, వారి వద్ద ఉన్న పక్కా మనీ-ట్రయల్ ఆధారాలను తక్కువ అంచనా వేయడం వల్లే అంబటి ఈ తరహా గేమ్స్ ఆడుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఆరోగ్య నెపంతో సమయం దాటవేసే రాజకీయాలు ఎంతో కాలం నిలబడవు. బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ సాక్ష్యాలు, బినామీల వాంగ్మూలాలు ఇప్పటికే ఈడీ చేతిలో ఉన్నందున తప్పించుకునే ప్రయత్నాలు ఆయనకు మరిన్ని చిక్కులు తెచ్చిపెట్టే అవకాశాలు ఉన్నాయి. ఈడీ బిగించే ఆర్థిక చక్రబంధం ముందు రాజకీయ ప్రదర్శనలు, ప్రెస్ మీట్లు పనిచేయవని, చట్టబద్ధమైన ప్రక్రియకు హాజరై తన తాను చెప్పే 90 ఎంఎల్ కథలు నిరూపించుకోకపోతే టెండర్ల నిబంధనలను ఉల్లంఘించి, ప్రభుత్వం నిర్దేశించిన రవాణా రేట్లను భారీగా పెంచడం ద్వారా కోట్ల రూపాయల నిధులు దారిమళ్లాయనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది. ఈ క్రమంలోనే గత కొన్ని సంవత్సరాలుగా జరిగిన వ్యక్తిగత బ్యాంక్ లావాదేవీల వివరాలు, ఆస్తుల పత్రాలతో సహా విచారణకు రావాలని ఈడీ అధికారులు అంబటి రాంబాబును ఆదేశించారు. ఇప్పటికే ఈ కేసులో పలువురు కీలక వ్యక్తులను అరెస్ట్ చేసిన ఈడీ, అంబటి రాంబాబు విచారణ ద్వారా మరిన్ని కీలక రహస్యాలను ఛేదించాలని భావిస్తోంది.

# ప్రతిష్టాత్మకంగా ఎన్నికలు తీసుకుంటున్న జనసేన



విశాఖపట్టణం, సెప్టెంబర్ 26 ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను జనసేనపార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, కూటమి భాగస్వామ్య పక్షాలతో పక్కా సమన్వయం కోసం ఐదుగురు సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏర్పాటు చేశారు. ఎన్నికల వేళ గ్రౌండ్ లెవెల్‌లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కా వ్యూహంతో ముందుకు వెళ్లేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారుఈ కొత్త కమిటీ ఇప్పటికే జనసేన పార్టీలో క్రియాశీలకంగా ఉన్న 14 మంది సభ్యుల ప్రధాన కమిటీతో కలిసి సంయుక్తంగా పని చేయనుంది. ఈ ఐదుగురు సభ్యుల కమిటీ రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించనుంది. వివిధ జిల్లాల్లో పార్టీ బలాబలాలు, డివిజన్లు మరియు స్థానిక సంస్థల వారీగా అభ్యర్థుల గెలుపు అవకాశాలు, పొత్తుల సమన్వయంలో ఎదురవుతున్న సవాళ్లపై లోతుగా అధ్యయనం చేసి ఈ ప్రత్యేక టీమ్ ఒక సమగ్ర నివేదికను సిద్ధం చేయనుంది.ఈ కమిటీలు క్షేత్రస్థాయి నుంచి సేకరించి సమర్పించే నివేదికల ఆధారంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీ సీనియర్ నేతలతో కలిసి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. ఆ నివేదికల ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలు, సీట్ల సర్దుబాట్లపై పవన్ కల్యాణ్ క్యాడర్‌కు దిశానిర్దేశం చేయనున్నారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల వేళ సీట్ల పంపకాలపై కూటమిలో అంతర్గత చర్చలు నడుస్తున్న తరుణంలో జనసేన ఈ ప్రత్యేక కమిటీని రంగంలోకి దించడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.స్థానిక సంస్థల ఎన్నికలు జనసేన పార్టీ నాయకత్వానికి ఒక సవాల్ గా మారాయి. ఇన్నాళ్లూ ఓపిక పట్టిన నేతలు ఎంతకాలం నుంచో ఈ ఎన్నికల కోసం కాచుక్కూర్చుని ఉన్నారు. పవన్ కల్యాణ్ పై అభిమానంతో పార్టీ జెండాను పట్టుకుని వదలకుండా పన్నెండేళ్ల నుంచి చేతబూనిన వారు ఈ ఎన్నికల్లో ఖచ్చితంగా పోటీ చేయాలని భావిస్తున్నారు. పవన్ కల్యాణ్ కూడా సీట్ల షేరింగ్ లో రాజీ పడబోమని చెప్పడం కొంత ఊరట నిచ్చే అంశమే. అయితే చివరకు సీట్ల షేరింగ్ విషయంలో పవన్ కల్యాణ్ కు పెద్ద సమస్య గా మారనుంది. సీట్ల షేరింగ్ ఎక్కువ అడిగితే వాటిని ఖచ్చితంగా గెలిపించుకోవాలి. తగ్గించుకుంటే ప్రత్యర్థులే కాకుండా సొంత పార్టీ నేతల నుంచి కూడా ప్యాకేజీ అంటూ కామెంట్స్ చేస్తారు. రాజీ పడకుండా.. రహదారి ఏంటి? అన్నదే పవన్ కల్యాణ్ ముందున్న ప్రశ్న. ఏ నిర్ణయమైనా పవన్ కల్యాణ్ కు ఈ ఎన్నికలు పెద్ద సమస్యగా మారాయని చెప్పాలి. ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు విషయంలో జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చాలా స్పష్టమైన, దూకుడు వైఖరిని ప్రదర్శిస్తున్నారు. కాకినాడలో జరిగిన పార్టీ కీలక సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలు కూటమి రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీశాయి.ప్రపంచ పటాలు పరిశీలించండి 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీని కూటమిలోకి తెచ్చే క్రమంలో టీడీపీ అభ్యర్థన మేరకు జనసేన సీట్లు తగ్గించుకుంది. కానీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ సీట్లు తగ్గిస్తామంటే ఒప్పుకునేది లేదని పవన్ కళ్యాణ్ తేల్చి చెప్పారు. చేసిన త్యాగాలు చాలని, సీట్ల కేటాయింపులో ఎలాంటి రాజీ పడబోమని స్పష్టం చేశారు. స్నేహపూర్వక పోటీకైనా సిద్ధమని ప్రకటించడం ఇప్పుడు సరికొత్త రాజకీయాలకు తెరలేపినట్లయింది. పొత్తుల లెక్కల్లో భాగంగా ఎక్కడైనా స్థానిక నాయకత్వాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే, కొన్ని స్థానాల్లో స్నేహపూర్వక పోటీ కి వెడదామని క్యాడర్‌కు దిశా నిర్దేశం చేశారు. అంటే ఒకరకంగా టీడీపీకి పరోక్షంగా వార్నింగ్ ఇచ్చిన పవన్ కల్యాణ్ అదే సమయంలో స్థానికంగా కూటమి నేతల మధ్య సయోధ్యను కుదుర్చుకోవాల్సిన బాధ్యత మీదేనంటూ లోకల్ లీడర్లపై పవన్ నెట్టేయడం కూడా ఒక రకంగా చర్చకు దారి తీసింది. ఒకే వార్డులో కూటమిలోని రెండు పార్టీలు పోటీ పడాల్సి వచ్చినా వెనకడుగు వేయొద్దని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. అదే సమయంలో కూటమి ధర్మం పాటించాలని పిలుపు నిచ్చారు. గత ఐదేళ్లలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని నిలబడిన గ్రౌండ్ లెవల్ కార్యకర్తలను, వీరమహిళలను ఈ ఎన్నికల ద్వారా బలోపేతం చేయాలనేది పవన్ ప్రధాన లక్ష్యం. 15 శాతం సీట్లు మాత్రమే జనసేనకు ఇస్తారంటూ వస్తున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు.వంద శాతం స్ట్రైక్ రేట్ లక్ష్యంగా పనిచేయాలని పార్టీకి బలమున్న ప్రతి చోటా అభ్యర్థులను నిలబెట్టాలని, అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే స్థానిక ఎన్నికల్లో కూడా 100 శాతం విజయాల రేటును నమోదు చేయాలనే వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు.ఎన్నికల సన్నద్ధత, వ్యూహాల కోసం ప్రత్యేక కమిటీని నియమించారు. ప్రచార కమిటీ బాధ్యతలను మంత్రి కందుల దుర్గేష్‌కు అప్పగించారు. మీరు అన్నట్లుగానే పవన్ కళ్యాణ్ తాజా స్పీచ్‌ను బట్టి చూస్తే, స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ తన ఆత్మగౌరవాన్ని, క్యాడర్ ప్రయోజనాలను పణంగా పెట్టి సీట్ల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదు. మరి చివరకు ఏం జరుగుతుందన్నది చూడాలి.

### ఆల్బెండజోల్ లోనులిపురుగు నివారణ మాత్రలను పంపిణీ చేసిన కలెక్టర్

ఒంగోలు జిల్లా వ్యాప్తంగా జాతీయ నలిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు.జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా ఒంగోలు లో ఆల్బెండజోల్ లోనులిపురుగు నివారణ మాత్రలను జిల్లా కలెక్టర్ రాజాబాబు పంపిణీ చేశారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు మరియు కౌమార బాల బాలికలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు వేయడం జరుగుతుందని, పాఠశాలలు, కళాశాలలు మరియు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఉచితంగా ఆల్బెండజోల్ 400 మి.గ్రా. మాత్రలను విద్యార్థులకు అందిస్తారని కలెక్టర్ తెలిపారు.

### జడ్పీ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్

ఒంగోలు జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ రాజాబాబు బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయానికి వచ్చిన ఆయనకు సీఈవో చిరంజీవి ఆధ్వర్యంలో ఆ శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పాలన అందించడమే ధ్యేయమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగేలా చర్యలు తీసుకుంటానన్నారు.

# సీఎం ఆదేశాల మేరకు

## ప్రతి గ్రామ పంచాయతీకి సొంత భవనం

**రూ.1000 కోట్లతో 5118 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం**

**ఇప్పటికే 3269 భవనాల పనులు 70 శాతం పూర్తి**

**ఈ ఏడాదిలో అన్ని భవనాల నిర్మాణం పూర్తి చేసేలా లక్ష్యం**

**8000 గ్రామాల్లో మహిళా సంఘాల భవనాలు**

**-- రూ.800 కోట్ల నిధులు**

**హ్యామ్ రోడ్ల పనులు సకాలంలో పూర్తి చేయాలి: మంత్రి సీతక్క**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీకి సొంత భవనం ఉండేలా స్యాచురేషన్ మోడ్‌లో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాన్ని



చేపడుతున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క తెలిపారు. తెలంగాణలో ప్రస్తుతం 5,118 గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు లేవని, ఆయా గ్రామ పంచాయతీలకు భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.1,000 కోట్ల నిధులను మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఇప్పటికే 3,269 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులు 70 శాతం మేర పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా ఈ ఏడాదిలో పూర్తి చేసేలా లక్ష్యంతో పనిచేస్తున్నామని వెల్లడించారు.

"ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు స్యాచురేషన్ మోడ్‌లో అన్ని గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు నిర్మిస్తాం. ప్రతి గ్రామ పంచాయతీకి ఒక భవనం ఉండేలా చర్యలు తీసుకుంటాం" అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రాంతీయ సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి సమీక్షించారు.

సమీక్షకు స్పెషల్ సీఎస్ దాన కిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, అడిషనల్ కమిషనర్ రవీందర్, అదనపు కలెక్టర్లు, సీఈవోలు, డీఆర్డీవోలు, డీపీఓలు, ఇంజినీరింగ్ చీఫ్‌లు, ఎస్ఈలు, ఈఈలు, ప్రాజెక్ట్ మానిటరింగ్ అధికారులు, జాయింట్ కమిషనర్లు, ఇతర సీనియర్ అధికారులు, హ్యామ్ రహదారుల కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

**8000 గ్రామాల్లో మహిళా సంఘాల భవనాలు**

గ్రామ పంచాయతీ భవనాలతో పాటు రాష్ట్రంలోని 8,000 గ్రామాల్లో మహిళా సంఘాల భవనాలను నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.800 కోట్ల నిధులను మంజూరు చేసిందని, ఇప్పటికే నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయని చెప్పారు. మహిళా సంఘాలకు సొంత భవనాలు అందుబాటులోకి వస్తే మహిళలు తమ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించుకునేందుకు అవకాశం కలుగుతుందని మంత్రి అన్నారు.

**హ్యామ్ విధానంలో దేశంలోనే తొలిసారిగా గ్రామీణ రహదారులు**

తెలంగాణలో గ్రామీణ రహదారులను హ్యామ్ విధానంలో నిర్మిస్తున్నామని, దేశంలోనే తొలిసారిగా ఈ విధానాన్ని గ్రామీణ రహదారుల నిర్మాణానికి వినియోగిస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు.

హ్యామ్ ప్రాజెక్టు కింద ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో 3,861 కిలోమీటర్ల మేర రహదారులను నిర్మిస్తున్నామని, ఇందుకోసం సుమారు రూ.3,382 కోట్లు ఖర్చు చేయనున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా హ్యామ్ ప్రాజెక్టు మొదటి విడతలో చేపడుతున్న రహదారుల్లో సుమారు 50 శాతం రహదారులు ఈ నాలుగు జిల్లాల్లోనే ఉన్నాయని, అందువల్ల అధికారులు, కాంట్రాక్టర్లు ప్రత్యేక శ్రద్ధతో పనులు చేపట్టాలని ఆదేశించారు.

అక్టోబర్ నుంచి జూన్ వరకు నిర్మాణ పనులకు అనువైన సమయం కాబట్టి ఈ కాలాన్ని పూర్తిగా వినియోగించుకుని పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

హ్యామ్ రహదారుల నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యతతో పాటు గడువులోగా పనులు పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు.

"తెలంగాణలో హ్యామ్ విధానంలో గ్రామీణ రహదారుల నిర్మాణాన్ని ఇతర రాష్ట్రాలు కూడా ఆసక్తిగా పరిశీలిస్తున్నాయి. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల ప్రతినిధులు తెలంగాణకు వచ్చి ఈ విధానంపై వివరాలు తెలుసుకున్నారు. ఇక్కడ కాంట్రాక్టర్లు మంచి పనితీరు కనబరిస్తే ఇతర రాష్ట్రాల్లో కూడా వారికి అవకాశాలు లభిస్తాయి" అని మంత్రి సీతక్క అన్నారు.

ప్రతి ఆవాసం నుంచి రాష్ట్ర రాజధానికి మెరుగైన రవాణా సదుపాయం కల్పించాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన అని, ఆ లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్రంలోని గ్రామీణ రహదారులను బలోపేతం చేస్తున్నామని తెలిపారు.

**ఎల్‌నినో నేపథ్యంలో తాగునీటిపై ముందస్తు చర్యలు**

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు.

ఈ నాలుగు జిల్లాల్లోని 19 రిజర్వాయర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామని, సింగూరు మినహా మిగిలిన రిజర్వాయర్లలో తగినంత నీటి నిల్వలు ఉన్నాయని తెలిపారు. సింగూరు రిజర్వాయర్‌లో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేనందున అక్కడ ప్రత్యేక అధికారిని నియమించి తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు. సింగూరుకు నిజాంసాగర్ నుంచి నీటిని తరలించే చర్యలను వేగవంతం చేయాలని సూచించారు.

సింగూరులో ప్రస్తుతం సుమారు 54 రోజులకు సరిపడా తాగునీటి నిల్వలు ఉన్నాయని, స్థానిక నీటి వనరులను వినియోగించుకోవడం ద్వారా సుమారు 75 రోజుల వరకు తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు



తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

**ప్రతి మండలానికి డ్రింకింగ్ వాటర్ మేనేజ్‌మెంట్ కమిటీ**

వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రతి మండలానికి ముగ్గురు సభ్యులతో డ్రింకింగ్ వాటర్ మేనేజ్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు.

ఈ కమిటీలు ఇప్పటి నుంచే మండలాల్లో పర్యటించి నీటి లభ్యతను అంచనా వేయాలని, ప్రత్యామ్నాయ నీటి వనరులను గుర్తించాలని సూచించారు.

ముఖ్యంగా ఆదివాసీ, గిరిజన ప్రాంతాలు, చెంచు పెంటల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

**ఉపాధి హామీ పనులను పెంచాలి**

వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయ పనులు తగ్గే అవకాశం ఉన్నందున అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పనులు కల్పించాలని మంత్రి సీతక్క సూచించారు.

"సామాన్యులకు ఉపాధి పని.. గ్రామాలకు ఆస్తులు కల్పించాలి. అప్పుడే గ్రామాలు సుస్థిరంగా అభివృద్ధి చెందుతాయి" అని అన్నారు.

ఉపాధి హామీ పనుల కోసం రూ.6 వేల కోట్ల బడ్జెట్ సిద్ధంగా ఉందని, దాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా గ్రామాల్లో మౌలిక వసతులు, నీటి సంరక్షణ పనులు చేపట్టాలని ఆదేశించారు. జలసిరి కార్యక్రమం కింద చేపట్టిన నీటి సంరక్షణ పనులను వేగంగా పూర్తి చేయాలని, ప్రతి గ్రామం సమృద్ధిగా, సమగ్రంగా అభివృద్ధి చెందేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు.

**అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి**

అభివృద్ధి పనుల్లో అధికారులు, కాంట్రాక్టర్లు చిత్తశుద్ధితో పనిచేయాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని, పనుల నాణ్యతలో రాజీ పడవద్దని ఆదేశించారు. "విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు. మంచిగా పనిచేసే అధికారులకు సన్మానాలు ఉంటాయి.. పనిచేయని అధికారులకు శ్రీముఖాలు ఉంటాయి" అని మంత్రి హెచ్చరించారు. గ్రామ పంచాయతీ భవనాలు, మహిళా సంఘాల భవనాలు, రహదారులు, తాగునీరు, ఉపాధి హామీ, నీటి సంరక్షణ వంటి అన్ని అంశాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లి ప్రతి గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క తెలిపారు.

## దూదిమట్ల లింగన్న పార్థివ దేహానికి నివాళులర్పించిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



కురవి డోర్నకల్ నియోజకవర్గం కురవి మండలం అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన దూదిమట్ల లింగన్న మృతి చెందారు,ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు సత్యవతి రాథోడ్ నేడు అయ్యగారిపల్లిలోని వారి నివాసానికి చేరుకొని లింగన్న పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు, అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారుఈ కార్యక్రమంలో కురవి మాజీ ఎంపీపీ బజ్జురి ఉమా పిచ్చిరెడ్డి , బోడ శ్రీను నాయక్, మాజీ సర్పంచ్ కొత్త వెంకన్న, మాజీ ఉపసర్పంచ్ బుడగల లక్ష్మయ్య, వార్డు మెంబర్ బుడుగు తదితరులు పాల్గొన్నారు

## టెంపోను ఢీకొన్న లారీ: 13 మంది వలస కార్మికులకు గాయాలు



అన్నమయ్య లారీ టెంపోను ఢీకొట్టడంతో 13 మంది బీహార్ వలస కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం ఉదయం కురబలకోట మండలంలో జరిగిన ఘటనపై బాధితుల కథనం.. బీహార్ పూర్ణియా జిల్లాకు చెందిన వీరు మదనపల్లె రామాచర్లపల్లె కాంట్రాక్టర్ చలపతి వద్ద ఏడాది కాలంగా దినసరి కూలీలుగా పనిచేస్తున్నారు. శనివారం ఉదయం వీరిని టెంపోలో వాహనంలో అంగళ్లకు తరలిస్తుండగా చేనేతనగర్ వద్ద లారీ టెంపోను ఢీకొట్టింది. అందులో మోల్డింగ్ పనులకు వెళుతున్న క్షతగాత్రులను స్థానికులు జిల్లా ఆసుపత్రికి తరలించగా, ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి మెరుగైన వైద్య చికిత్సలు అందించడంతో ప్రాణాపాయం తప్పింది. ఘటనపై ముదివేడు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మోలియపుట్టి రహదారిని పరిశీలించిన మంత్రి అచ్చెన్నాయుడు

శ్రీకాకుళంలో టెక్కలిలో రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విస్తృత పర్యటన చేశారు. పురుషోత్తం సాగర్ గండి పడడంతో మెలియాపుట్టి రహదారిని పరిశీలించారు. తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాలను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విస్తృతంగా పరిశీలించారు. పలు ప్రాంతాల్లో పర్యటించి, ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న రహదారులను స్వయంగా పరిశీలించారు. రహదారుల పునరుద్ధరణకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్, రహదారులు, భవనాల శాఖల అధికారులతో పరిస్థితిపై సమీక్షించి, ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. పాడైన రహదారులకు మరమ్మతులు చేపట్టడంతో పాటు, కొత్త రహదారుల ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లోని అన్ని గ్రామాలకు నూతన రహదారులు వేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని రహదారులు, పంచాయతీరాజ్, ఐటీడీఏ అధికారులకు సూచించారు.

## చాకలి ఐలమ్మకు తలసాని నివాళి

సనత్‌నగర్ ప్రజాబలం ప్రతినిధి: సికింద్రాబాద్. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని నేడు కంటోన్మెంట్ నియోజకవర్గం మడ్ ఫోర్ట్ లో జరిగిన కార్యక్రమంలో మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ రాజకర్లకు వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గాల భూమి కోసం, భుక్తి కోసం పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. అందుకే ఆమె త్యాగాలకు గుర్తింపుగా కేసీఆర్ ప్రభుత్వం అధికారికంగా చాకలి ఐలమ్మ ఐలమ్మ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించింది గుర్తు చేశారు.

# ఇక కౌశిక్ రెడ్డి వంతు



కరీంనగర్ సెప్టెంబర్ 26 పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అస్త్రంగా చేసుకుని సుప్రీంకోర్టు దాకా న్యాయపోరాటం చేసి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయించడంలో బీఆర్ఎస్ అధిష్ఠానం విజయం సాధించింది. ఇప్పటికి బీఆర్ఎస్ అధికారికంగా మూడు సీట్లను కోల్పోయింది. ఇద్దరు ఎమ్మెల్యేలు చనిపోయారు. మూడో ఎమ్మెల్యే అనర్హతకు గురయ్యారు. మరో ఎమ్మెల్యేను కూడా తగ్గించేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతోంది. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి లక్ష్యంగా అనర్హత అస్త్రాన్ని సిద్ధం చేస్తోంది. ఒకే దెబ్బకు రెండు అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికలు తీసుకొచ్చి బీఆర్ఎస్‌ను ఆత్మరక్షణలోకి నెట్టాలన్నది రేవంత్ రెడ్డి సర్కార్ పక్కా ప్లాన్‌గా కనిపిస్తోంది. శాసనసభ సమావేశాల్లో సీనియర్ నేత, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని ఉద్దేశించి పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, అనుచిత ప్రవర్తనను కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణించింది. ఈ వ్యవహారంపై ఇప్పటికే శాసనసభ ప్రివిలేజ్ కమిటీ విచారణను ముమ్మరం చేసింది. సభా మర్యాదలు ఉల్లంఘించడం, అసెంబ్లీ సాక్షిగా తోటి సభ్యుడిని అవమానించేలా ప్రవర్తించడంపై కమిటీ నివేదికను సిద్ధం చేస్తోంది. ప్రివిలేజ్ కమిటీ ఇచ్చే సిఫారసుల ఆధారంగా కౌశిక్ రెడ్డిపై శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకునేందుకు లైన్ క్లియర్ అవుతోంది. సభా నియమావళి, శాసనసభ అంతర్గత క్రమశిక్షణ వ్యవహారాల్లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 212 ప్రకారం కోర్టులు నేరుగా జోక్యం చేసుకోలేవన్నది న్యాయ నిపుణుల స్పష్టమైన అభిప్రాయం. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలోనూ సరిగ్గా ఇలాంటి సంప్రదాయమే నడిచింది. ఉమ్మడి అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం సమయంలో హెడ్‌ఫోన్స్ విసిరేశారన్న కారణంతో కాంగ్రెస్ నేతలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్ కుమార్‌ల శాసనసభ సభ్యత్వాలను రద్దు చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. న్యాయస్థానాలు సైతం శాసనసభాపతి నిర్ణయాధికారాల పరిధిని పరిగణనలోకి తీసుకుంటూ తీర్పులు ఇచ్చాయి. ఇప్పుడు అదే అస్త్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తిరగేసి ప్రయోగించేందుకు పూర్తి కసరత్తు చేస్తోంది. దానం నాగేందర్ కేసులో టెన్త్ షెడ్యూల్ నిబంధనలతో కోర్టుల ద్వారా బీఆర్ఎస్ ముందడుగు వేస్తే, కౌశిక్ రెడ్డి విషయంలో అసెంబ్లీ విశేషాధికారాల కమిటీ నివేదిక ద్వారా కాంగ్రెస్ తన రాజకీయ పగను తీర్చుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంది. ఒకవేళ కౌశిక్ రెడ్డిపై అనర్హత వేటు పడితే.. తెలంగాణలో కేవలం ఖైరతాబాద్ మాత్రమే కాకుండా హుజూరాబాద్ నియోజకవర్గంలోనూ ఉపఎన్నిక అనివార్యమవుతుంది. ఒకవైపు హైదరాబాద్ నగరంలో దానంపై వచ్చిన తీర్పును రాజకీయంగా ఎలా ఎదుర్కోవాలో తెలియక బీఆర్ఎస్ తలమునకలవుతుండగా, మరోవైపు కరీంనగర్ జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకమైన హుజూరాబాద్ స్థానంలోనూ ఉపఎన్నికకు వెళ్లాల్సి రావడం గులాబీ పార్టీకి శరాఘాతమే అవుతుంది. దూకుడు ప్రదర్శిస్తున్న కౌశిక్ రెడ్డిని కట్టడి చేయడంతో పాటు, ఆ స్థానాన్ని తిరిగి చేజిక్కించుకుని బీఆర్ఎస్ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయాలని కాంగ్రెస్ భావిస్తోంది. అంతిమంగా, దానంపై వేటు వేయించి సంబరపడేలోపే.. హుజూరాబాద్ రూపంలో బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ డబుల్ షాక్ ఇవ్వడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది.

# 104 నియోజకవర్గాల్లో పావు వంతు ఓట్లు గల్లంతు

వరంగల్, సెప్టెంబర్ 26 ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్క ఓటు అత్యంత విలువైనది. దేశ భవిష్యత్తును, నాయకుల గెలుపోటములను నిర్ణయించేది ఓటు హక్కే. అయితే ఇటీవల తెలంగాణలో ఓట్ల గల్లంతు అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల సంఘం ఓటరు జాబితాలో సమూల ప్రక్షాళన కోసం సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియ చేపట్టిన సంగతి తెలిసిందే. దీని ప్రకారం రాష్ట్రంలోని మెజారిటీ నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితా నుంచి పెద్ద ఎత్తున పేర్లు మాయమవడం ఎన్నికల ప్రక్రియపై అనేక సందేహాలను రేకెత్తిస్తోంది. తెలంగాణలోని దాదాపు 104 అసెంబ్లీ నియోజకవర్గాల్లో గత ఎన్నికలతో పోలిస్తే? ప్రతి నాలుగు ఓట్లలో ఒక ఓటు గల్లంతయ్యే ప్రమాదం కనిపిస్తోంది. గైర్హాజరు, శాశ్వతంగా నివాసం మార్చిన వారు, మరణించిన వారు, ఒకటికి మించి ఓట్లు ఉన్నవారు? అనే నిబంధనల కింద ఈ పేర్లను గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ తొలగింపు ప్రక్రియలో కేవలం సాంకేతిక లోపాలు మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించే అధికారుల తీరుపై కూడా విమర్శలు వస్తున్నాయి. మరణించిన వారిగా చూపిన కేసుల్లో అత్యధిక శాతం మంది ఇతర కారణాల వల్ల తొలగించబడినవారే కావడం గమనార్హం. ఈ ఓట్ల గల్లంతు జాబితాలో మహిళల పేర్లు గణనీయంగా ఉండటం మరో కీలక పరిణామం. తొలగించబడిన ఓట్లలో సగానికి పైగా మహిళలవే ఉండగా, వారిలోనూ వివాహం తర్వాత నివాసాలు మారిన వారు లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. అలాగే, వివిధ వయసుల వారూ ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా యువత ఉన్నత చదువుల నిమిత్తం లేదా ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడంతో వారి పేర్లు జాబితా నుంచి తొలగిపోతున్నాయి .మరోవైపు మైనారిటీ ఓటర్ల తొలగింపు అంశం కూడా రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. కొన్ని నియోజకవర్గాల్లో జనాభా నిష్పత్తితో పోలిస్తే, ఆ వర్గానికి చెందిన పేర్లు తొలగింపు జాబితాలో కొద్దిగా ఎక్కువగా ఉండటం గమనించదగ్గ విషయం. అయితే, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం మతం ఆధారంగా ఓటర్ల జాబితా తయారీ జరగదని, కేవలం పేర్ల ఆధారంగానే అంచనా వేస్తారని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కొన్ని నిర్దిష్ట పోలింగ్ బూత్‌లలో అత్యధిక సంఖ్యలో ఓట్లు తొలగించబడటం ఆశ్చర్యం కలిగిస్తోంది. రంగారెడ్డి జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో వేల సంఖ్యలో ఓట్లు అన్ ట్రేసబుల్ గా గుర్తించారు. క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి అధికా రులు ఇంటింటికీ తిరిగి సరైన విచారణ జరపకపోవడం, లేదా ఓటర్లు అందుబాటులో లేనప్పుడు సరైన సమాచారం సేకరించ కుండానే ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం దీనికి ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తున్నారుఓటరు జాబితా రూపకల్పన అనేది నిరంతరం జరిగే ప్రక్రియ. కానీ, ఈ తరహా భారీ ఎత్తున ఓట్ల గల్లంతు ప్రజల ఓటు హక్కును కాలరాసే ప్రమాదం ఉంది. ప్రజాస్వామ్య బద్ధమైన ఎన్నికల్లో ప్రతి అర్హులైన పౌరుడు తన ఓటు హక్కును వినియోగిం చుకునేలా చూసే బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం అధికా రులు క్షేత్రస్థాయి పరిశీలనను మరింత పకడ్బందీగా చేయాలి. పొరపాట్లకు తావు లేకుండా బూత్ స్థాయి అధికారులకు సరైన శిక్షణ ఇవ్వడం, ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైన పుడు వారికి తగిన సమాచారం అందిం చడం వంటి చర్యలు చేపట్టాలి.

అప్పు డే ప్రజలకు ఎన్నికల వ్యవస్థపై నమ్మకం బలపడు తుంది, ప్రజాస్వామ్య స్ఫూర్తి పరిఢవిల్లుతుంది.

## ఎస్‌సీటీ పోలీసుల పాసింగ్ ఐట్ పరెట్
## పాల్గొన్న మంత్రి నారాయణ

వెంకటగిరి సమాజ రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ అన్నారు. పోలీసు విధుల్లో ప్రజల విశ్వాసాన్ని పొందేలా సేవలందించాలని సూచించారు. తిరుపతి జిల్లా వెంకటగిరిలోని 9వ ఏపీఎస్పీ బెటాలియన్ ఆధ్వర్యంలో నూతనంగా ఎంపికైన 231 మంది ఎస్‌సీటీ పోలీసు కానిస్టేబుళ్లు తొమ్మిది నెలల కఠిన శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా బెటాలియన్ ఆవరణలో శిక్షణ ముగింపు వేడుకలు, పాసింగ్ అవుట్ పరేడ్‌ను ఘనంగా నిర్వహించారు. 9వ బెటాలియన్ ఏపీఎస్పీ వెంకటగిరిలో ఉందని ప్రభుత్వ జిల్లా వెబ్‌సైట్ కూడా ధ్రువీకరిస్తోంది. కార్యక్రమానికి మంత్రి పి. నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వెంకటగిరి ఎమ్మెల్యే కే. రామకృష్ణ, 9వ ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ ప్రిన్సిపాల్ రామచంద్ర, అడిషనల్ కమాండెంట్ మనోహర్‌తో పాటు పలువురు ఉన్నత పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసిన కానిస్టేబుళ్ల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కూడా హాజరయ్యారు. తొమ్మిది నెలల శిక్షణలో క్రమశిక్షణ, శారీరక దార&ఢ్యం, మానసిక స్థైర్యం, ఆయుధ శిక్షణతో పాటు శాంతిభద్రతల నిర్వహణ, గుంపుల నియంత్రణ, బందోబస్తు, అత్యవసర విధులు తదితర అంశాల్లో శిక్షణ అందించారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన 231 మంది కానిస్టేబుళ్లను మంత్రి నారాయణ అభినందించారు.

# 22ఏ భూములు
# 1.41 లక్షల ఆస్తులకు విముక్తి

హైదరాబాద్, సెప్టెంబర్ 26 ఏళ్ల పాటు లక్షలాది మంది మధ్యతరగతి ప్రజలను తీవ్ర ఇబ్బందులు పడుతున్న నిషేధిత భూముల 22ం చిక్కుముడికి తెలంగాణ ప్రభుత్వం విముక్తి కల్పించింది. రాష్ట్రవ్యాప్తంగా చాలా కాలం నుంచి 22ఏ జాబితాలో కొనసాగుతున్న ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్లకు విముక్తి కల్పిస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 16న శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు.. తాజాగా ఉత్తర్వులు అమల్లోకి వచ్చింది. గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, దామోదర్ రాజనర్సింహ, వివేక్‌లు ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ భేటీ అనంతరం రెవెన్యూశాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్..22ఏ భూములపై కీలక ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌తోపాటు పలు జిల్లాల్లో సుమారు 300 కాలనీల్లోని 1.41 లక్షల ఇళ్లు, ప్లాట్లకు ఈ ఉత్తర్వులతో ఉపశమనం లభించనుంది. కేవలం రంగారెడ్డి జిల్లాలోనే 44, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 65 కాలనీలు ఈ జాబితాలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కోర్టు కేసుల తీర్పులు, భూముల వేలం, క్రమబద్ధీకరణల అనంతరం ఏర్పడిన కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న వారి వివరాలు ఆన్‌లైన్ రికార్డుల్లో అప్‌డేట్ కాకపోవడం వల్ల ఈ సమస్య తలెత్తింది. హైకోర్టు ఆదేశాలతో గత ఏడాది 22ఏ జాబితాను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినప్పుడు కొన్ని నివాసిత ప్రాంతాలు కూడా పొరపాటున ఇందులో చేర్చారు. ఫలితంగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఆందోళన చెందారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ స్థానిక సంస్థల నుంచి చట్టబద్ధమైన అనుమతులు పొంది అభివృద్ధి చేసిన ఖాళీ స్థలాలు, ఇళ్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు 22ఏ జాబితా నుంచి తొలగిస్తారు. దరఖాస్తుదారులు ప్రభుత్వ సంస్థల నుంచి చెల్లుబాటు అయ్యే లేఅవుట్, భవనం లేదా అపార్ట్‌మెంట్ నిర్మాణ అనుమతి పత్రాలను సమర్పించాలి. అనుమతుల అనంతరం రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఏదో ఒక లింక్ డాక్యుమెంట్‌ను చూపించాల్సి ఉంటుంది.

ఏవైనా ప్రత్యేక సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించడానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులు మాత్రం ఆయాన్యాయస్థానాల తుది తీర్పులకు లోబడి ఉంటాయి. దశాబ్దాలుగా ప్రజలను వేధిస్తున్న ఈ సమస్యను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరించినట్లు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని, ఇప్పటికే రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని కాలనీల క్రమబద్ధీకరణకు జీవో 118, సింగరేణి కార్మికుల కోసం జీవో 76 జారీ చేశామని గుర్తుచేశారు. భూమి స్వభావం, రికార్డులను పరిశీలించి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పరిష్కారం చూపిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# సునీల్ బన్సాల్ ఫిర్ ఆగయా...



హైదరాబాద్, సెప్టెంబర్ 26 తెలంగాణ బీజేపీ రాజకీయాల్లో అధిష్టానం కీలక అడుగు వేసింది. రాష్ట్ర బీజేపీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా సీనియర్ వ్యూహకర్త సునీల్ బన్సల్‌నే మళ్లీ నియమిస్తూ, ఆయనకు సహకారంగా ఇద్దరు సహ ఇన్‌ఛార్జులను కూడా రంగాంలోకి దించింది. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో ఏకంగా 8 పార్లమెంట్ స్థానాలను గెలుచుకోవడమే కాకుండా, దాదాపు 35 శాతానికి పైగా ఓట్ షేర్ సాధించి కమలదళం చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. ఈ గెలుపు ఇచ్చిన ఊపుతో, రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్‌కు ఏకైక ప్రత్యామ్నాయం తామేనన్న భావనను ప్రజల్లో బలంగా నాటడమే ప్రాథమిక లక్ష్యంగా బన్సల్ నాయకత్వంలో కొత్త టీమ్ రంగంలోకి దిగుతోంది. ప్రస్తుతం తెలంగాణ రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. దశాబ్ద కాలం పాటు రాష్ట్రాన్ని ఏలిన ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ వరుస పరాజయాలు, నాయకుల వలసలు, అంతర్గత సంక్షోభంతో తీవ్రంగా కొట్టుమిట్టాడుతోంది. క్షేత్రస్థాయిలో ఉన్న సొంత కేడర్‌ను కాపాడుకునేందుకు ఆ పార్టీ గులాబీ అధినేతలు ఆపసోపాలు పడుతున్నారు. ఈ రాజకీయ శూన్యతను పూర్తిగా వాడుకుని, బీఆర్ఎస్ ఆక్రమించి ఉన్న ద్వితీయ స్థానాన్ని తమ వశం చేసుకోవడం బన్సల్ టీమ్ ముందున్న అత్యంత ప్రధానమైన టాస్క్. తెలంగాణలో రాజకీయ పోరును ఇకపై కాంగ్రెస్ లబ బీజేపీ గా మార్చడమే వారి అసలైన వ్యూహం. ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రంలో బీజేపీని అట్టడుగు స్థాయి నుంచి విజయతీరాలకు చేర్చడంలో సునీల్ బన్సల్ పాత్ర అత్యంత కీలకం. బూత్ స్థాయి నెట్‌వర్క్ నిర్వహణలో మరియు ఆర్గనైజేషనల్ ప్లానింగ్‌లో ఆయన దిట్ట. గ్రౌండ్ లెవల్ పట్టును పెంచేందుకు ఆయన సమగ్ర కార్యాచరణను సిద్ధం చేయాల్సి ఉంది. స్థానిక సంస్థల్లో బీజేపీ జెండా ఎగురవేస్తేనే, రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీకి గ్రామీణ ప్రాంతాల్లో బలమైన పునాది ఏర్పడుతుందని కమలనాథులు భావిస్తున్నారు. అయితే బన్సల్ ముందున్న బాట అంత సులువేమీ కాదు. పార్లమెంట్ ఎన్నికల నాటి ప్రధాని మోదీ హవా, స్థానిక ఎన్నికలు లేదా అసెంబ్లీ పోరులో ఒకేలా పనిచేయదు. పైగా క్షేత్రస్థాయిలో బీజేపీకి బలమైన క్లస్టర్ నాయకత్వం ఉన్నప్పటికీ, వివిధ జిల్లాల్లో పార్టీ విభేదాలు, ముఠా తత్వాలు ఇంకా సవాలుగానే ఉన్నాయి. సీనియర్లు, కొత్తగా చేరిన నేతల మధ్య సమన్వయం కుదర్చడం, పార్టీ ఐక్యతను చాటడం బన్సల్ ఇద్దరు సహ ఇన్‌ఛార్జులతో కలిసి అధిగమించాల్సిన అతిపెద్ద పరిమితి. బీజేపీకి రాబోయే ఒక సంవత్సరం అత్యంత కీలకమైన టైమ్ విండో. వచ్చే ఏడాది కాలంలో పార్టీ తన శ్రేణులను ఏకీకృతం చేసి, నిరసనలతో ప్రజల్లో ఉంటూ పుంజుకోకపోతే, తెలంగాణ రేసులో నిలవడం కష్టమవుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే హామీలు, పాలనా విధానాలను గట్టిగా ప్రశ్నిస్తూనే, బీఆర్ఎస్ స్పేస్‌ను సొంతం చేసుకోగలిగితేనే బీజేపీకి భవిష్యత్తు ఉంటుంది. లేనిపక్షంలో మళ్లీ ప్రాంతీయ సమీకరణాలు పుంజుకునే అవకాశం ఉంటుంది. బీఆర్ఎస్ పని అయిపోయిందని, కాంగ్రెస్‌కు డెరెక్ట్ టార్గెట్ బీజేపీనే అని బీజేపీ కేడర్ ట్రెండ్ చేస్తుంటే, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వేరు, లోకల్ బాడీ ఎన్నికల ఫలితాలు వేరని ప్రత్యర్థి పార్టీలు కౌంటర్ ఇస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ, సునీల్ బన్సల్ రీ-ఎంట్రీతో తెలంగాణ బీజేపీకి సరికొత్త పొలిటికల్ బూస్టర్ డోస్ లభించిందనడంలో సందేహం లేదు. కానీ బీజేపీ నాయకులు ఎంత మేర ఉపయోగించుకుంటారన్నదే కీలకం.

# ఫామ్ హౌస్ ఫైల్స్...

హైదరాబాద్, సెప్టెంబర్ 26 తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ మధ్య ఫామ్‌హౌస్‌లు, అక్రమాస్తుల రగడ తీవ్ర స్థాయికి చేరింది. తెలంగాణ ఉద్యమానికి ముందు సాధారణ మధ్యతరగతి జీవితాలు గడిపిన బిఆర్ఎస్ ముఖ్య నేతలు, పదేళ్ల అధికారంలో విపరీతంగా ఆస్తులు కూడబెట్టారంటూ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఫామ్‌హౌస్ ఫైల్స్ పేరిట క్షేత్రస్థాయి యాత్రలు చేపట్టారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న జాన్వాడ, అజీజ్ నగర్, శంషాబాద్ ప్రాంతాల్లోని ఫామ్‌హౌస్‌ల వద్దకు వెళ్లి మీడియా ముందు బిఆర్ఎస్ నేతల ఆస్తుల వివరాలను ఎండగట్టడం రాజకీయంగా పెద్ద దుమారమే రేపుతోంది. ఈ యాత్రల ప్రధాన ఉద్దేశం ప్రజల్లో ఒక బలమైన రాజకీయ విధానాన్ని బదిలీ చేయడమే. ఉద్యమ సమయంలో మామూలు చెప్పులతో తిరిగిన నాయకులు అధికారంలోకి వచ్చాక వేల కోట్ల ఆస్తులు, విలాసవంతమైన విల్లాలు ఎలా సంపాదించారనే అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం కాంగ్రెస్ వ్యూహం. ముఖ్యంగా ఎలక్షన్ అఫిడవిట్లలో వారు చూపించిన ఆస్తులకు, బయట కనిపిస్తున్న విలాసవంతమైన జీవితాలకు పొంతన లేదంటూ కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇది సాధారణ పౌరుల్లో సహజంగానే పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తోంది. ఇక్కడే ఒక పెద్ద ప్రశ్న ఉత్పన్నమవుతోంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలో ఉండి కూడా.. కేవలం మీడియా పర్యటనలకే పరిమితం కావడం వెనుక అంతరార్థం ఏమిటి? ఇవన్నీ అక్రమాస్తులే అని ప్రభుత్వం గట్టిగా నమ్మినప్పుడు, ఆ వివరాలన్నింటినీ అధికారికంగా బయటపెట్టి, ఏ సంవత్సరంలో కొనుగోలు చేశారు, నిధుల మూలాలు ఏంటి అనే దానిపై సమగ్రమైన విచారణ ఎందుకు జరిపించడం లేదు? ఒక ప్రత్యేక విచారణ కమిటీని లేదా సీఐడీ , విజిలెన్స్ విచారణను ఆదేశిస్తే నిజానిజాలు స్పష్టంగా బయటకు వస్తాయి కదా అనేది ప్రధాన సందేహం. శాసనసభ రికార్డులు, భూ రజిస్ట్రేషన్ వివరాలు, ల్యాండ్ సీలింగ్, ఊా 111 నిబంధనల ఉల్లంఘనలు వంటి సాంకేతిక ఆధారాలన్నీ ప్రభుత్వ పరిధిలోనే ఉంటాయి. విచారణ చేపడితే అక్రమాలు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకునే లేదా ఆస్తులను జప్తు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంది. కానీ, ఆ దిశగా లీగల్ ప్రాసెస్ ప్రారంభించకుండా కేవలం నాయకులు గేట్ల ముందుకు వెళ్లి ప్రెస్ మీట్లు పెట్టడం వల్ల ఇది చట్టపరమైన పోరాటం కంటే రాజకీయ ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తోంది. మరోవైపు బిఆర్ఎస్ నేతలు ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నారు. తమ ఆస్తుల వివరాలన్నీ క్రమం తప్పకుండా ఆదాయపన్ను శాఖ కు, ఎన్నికల కమిషన్‌కు అఫిడవిట్ల రూపంలో సమర్పించామని, అన్నీ పారదర్శకమైనవని వాదిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ హామీల అమలు నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే ఈ ఫామ్‌హౌస్ డ్రామాలు ఆడుతోందని, ధైర్యముంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బిఆర్ఎస్ సవాల్ విసురుతోంది. న్యాయపరంగా అక్రమాస్తులను నిరూపించడం సుదీర్ఘమైన ప్రక్రియ. కేవలం ఫామ్‌హౌస్ ఉంది అనగానే అది అక్రమాస్తి అయిపోదు.

# సిగ్మా' ట్రైలర్ చాలా ఎంటర్టైనింగ్‌గా ఉంది. సూపర్ హిట్ అవుతుంది : మెగాస్టార్ చిరంజీవి



సందీప్ కిషన్ యాక్షన్-అడ్వెంచర్ హీస్ట్ కామెడీ ఎంటర్టైనర్ 'సిగ్మా'. ఈ సినిమాతో జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఫారియా అబ్దుల్లా హీరోయిన్. ప్రతిష్టాత్మక లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రంపై ప్రమోషనల్ కంటెంట్‌తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. కోస్తాంధ్ర, తెలంగాణలో మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ లిమిటెడ్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తుండగా, సీడెడ్ ప్రాంతంలో ఎన్వీఆర్ సినిమా విడుదల చేస్తుంది. అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్ గా జరిగింది.

ప్రీరిలీజ్ ఈవెంట్ లో మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ...అందరికీ నమస్కారం. నేను నేరుగా కాకా షూటింగ్ నుంచి వస్తున్నాను. ఏడు గంటల వరకు షూటింగ్ అయింది. త్వరగా ఫినిష్ చేయండి, ఈవెంట్‌కి వెళ్తానని చెప్పాను. అక్కడ అందరూ రెస్ట్ తీసుకోవచ్చు కదా అని అన్నారు. వాళ్ల పాయింట్ ఆఫ్ వ్యూలో అది కరెక్టే. కానీ నేను మాత్రం ఒక వేడుకకు రావడం బాధ్యతగా ఫీల్ అవుతాను. ఇలాంటి యువ ప్రతిభావంతులు సినిమా చేసిన అది ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేటప్పుడు ఎంతోకొంత వాళ్లకి ఉపయోగపడాలని, వాళ్లకు ఉత్సాహాన్ని ఇచ్చే నాలుగు మాటలు చెప్పాలనే భావన నాకు కలుగుతుంది. నాకు ఎప్పుడూ కూడా ఒక వేడుకకు రావడం శ్రమ కాదు, అది ఒక బాధ్యత అనిపిస్తుంది. సందీప్ నన్ను చాలా ఇష్టపడతాడు. తను మా కుటుంబ సభ్యుడిలాంటివాడే. తనతో నాకు చాలా అనుబంధం ఉంది. నాకు సంజయ్, సందీప్ పట్ల ఇష్టం ఉంది. సంజయ్ తాతగారు నాకు 'చట్టానికి కళ్లులేవు', 'దేవాంతకుడు' లాంటి అద్భుతమైన చిత్రాలు ఇచ్చారు. ఆయన మనవడు డైరెక్ట్ చేస్తున్నాడు అంటే కచ్చితంగా ఈ వేడుకకు రావాలనిపించింది. అలాగే విజయ్ సినిమాలకు కూడా మేము ముహూర్తానికి వెళ్లడం జరిగింది. అలాంటి కుటుంబంలో ఒక పిల్లవాడు ఒక సినిమా చేస్తున్నాడు అంటే ఆ వేడుకకు రావడం నాకు చాలా సంతోషం. సంజయ్‌ని చూస్తే విజయ్‌ని చూసినట్టుగా ఉంటుంది. తను ఎందుకు హీరో కాకూడదు అని అడిగినప్పుడు, నాకు దర్శకత్వం, రచన అంటే ఇష్టం అని చెప్పాడు. అది వాళ్ల తాతగారు, నాన్నామ్మ ద్వారా వచ్చుంటుంది. సంజయ్ తాతగారు, గారి లాగే సంజయ్ కూడా తన ప్యాషన్ తో డైరెక్షన్‌లో ఉన్నత స్థాయికి వెళ్లాలని కోరుకుంటున్నాను. దానికి ఈ రోజు నాంది అని భావిస్తున్నాను. అక్టోబర్ 2న రిలీజ్ అవుతున్న ఈ సినిమా ఖచ్చితంగా విజయం సాధించాలని కోరుకుంటున్నాను. ఈ మధ్యకాలంలో కంటెంట్ బాగుంటే ప్రతి సినిమాని ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. ఈ మధ్యకాలంలో 'ఇరుముడి' గొప్ప విజయాన్ని సాధించింది. అదే పరంపరలో 'సిగ్మా' కూడా చాలా పెద్ద విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను. సందీప్ చాలా వెరైటీ సినిమాలు చేస్తుంటాడు. తనని చూస్తుంటే నా యంగర్ డేస్‌లో నన్ను నేను చూసుకున్నట్టుగా అనిపిస్తుంది. తను కంటెంట్‌ని సెలెక్ట్ చేసుకోవడంలో చూపే శ్రద్ధ చాలా బాగుంటుంది. ప్రతి ఒక్కరు తమ ప్రత్యేకతను నిరూపించుకోవాలి. అప్పుడే గుర్తింపు వస్తుంది. 'సిగ్మా' అంటే తనకు నచ్చింది చేసే వ్యక్తి. బహుశ ఇందులో హీరోది అలాంటి క్యారెక్టర్. అందుకే ఈ జెన్-జీ జనరేషన్‌కి అర్థమయ్యేలా, వాళ్ల భాషలోనే అలాంటి ఒక యంగ్ డైరెక్టర్ సినిమాకి 'సిగ్మా' అనే టైటిల్ పెట్టారని నేను అనుకుంటున్నాను. ఇది చాలా కొత్త ఆలోచన. ట్రైలర్ చూస్తుంటే చాలా ఎంటర్టైనింగ్‌గా ఉంది. చాలా హుషారుగా ఉంది. ఈ సినిమా ఫస్ట్ కాపీ నాకు చూపించాలని కోరుతున్నాను. ఫరియా ఒక సందర్భంలో స్టేజ్ మీద నాతో డాన్స్ చేయించింది. ఆ వీడియో ప్రేక్షకులకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది. లైకా ప్రొడక్షన్స్‌కి కంగ్రాచులేషన్స్. మైత్రీ మూవీ మేకర్స్ ఒక సినిమా చేస్తే అది సూపర్ హిట్. ఈ సినిమా కూడా హిట్ చేసి నిర్మాతలకు మంచి డబ్బులు వచ్చేలాగా చూడాలని కోరుకుంటున్నాను. తమన్ ఎప్పుడు కూడా నా మనసులో ఉంటాడు. కాక ఆల్రెడీ ఫస్ట్ ఆఫ్ అయిపోయింది. సెకండ్ హాఫ్ కూడా 30 శాతం అయిపోయింది. మంచి జోష్‌తో ఉన్నాడు. తమన్ ప్రామిస్ చేసినట్టుగా ఈ సంక్రాంతి మనది. సిగ్మాలో పనిచేసిన ప్రతి ఒక్కరికీ, టెక్నీషియన్స్‌కి అందరికీ పేరుపేరునా ఆల్ ది బెస్ట్. పరిశ్రమకి కొత్తవాళ్లు రావాలి. పరిశ్రమ కొత్త పుంతలు తొక్కాలి. తెలుగు పరిశ్రమలో ఎవరైనా సరే మంచి కంటెంట్ ఇస్తే వాళ్లకి స్వాగతం చెప్తాం. సంజయ్ చేసిన సినిమాని తెలుగు ప్రేక్షకులు ఖచ్చితంగా ఆదరిస్తారు, సూపర్ హిట్ చేస్తారని నమ్ముతున్నాను. అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్. జైహింద్.

హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ.. తెలుగు పరిశ్రమలో మా జనరేషన్‌కి, మా తర్వాత వచ్చే జనరేషన్‌కి గురువు మెగాస్టార్ చిరంజీవి గారు. ఆయన చూడని బాక్సాఫీస్ రికార్డులు లేవు. ఆయన మా అందరికీ ఎంతో స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఇండస్ట్రీ ఇంటర్నేషనల్ స్థాయికి వెళ్ళిందంటే దానికి పునాది వేసింది మెగాస్టార్ చిరంజీవి గారే. నా 16 ఏళ్ల కెరీర్‌లో 22 తెలుగు సినిమాలు, 9 తమిళ్ సినిమాలు చేశాను. రెండు హిందీ ప్రాజెక్ట్స్ చేశాను. ఫస్ట్ టైం నా ఈవెంట్‌కి ఇంత పెద్ద స్టార్ రావడం. నేను ఎప్పుడూ ఎవరినీ ఏమీ అడగలేదు. నాకు వచ్చింది నా స్టైల్‌లో చేసుకుంటూ వెళ్లాను. ఫస్ట్ టైం నేను ఆయనని అడగడం, ఆయన నా కోసం రావడం చాలా ఆనందంగా ఉంది. చిరంజీవి గారు చాలా స్వీట్ అండ్ క్యూట్. ఆయన నుంచి మాకు దీపావళి గిఫ్ట్స్ వస్తుంటాయి. వాట్సాప్‌లో స్టిక్కర్ పంపిస్తుంటారు. అది మాటల్లో చెప్పలేని ఆనందం. లైకా సంస్థకి థాంక్యూ. సంజయ్ డ్రీమ్‌ని నమ్మి నాతో సినిమా తీసినందుకు వారికి ధన్యవాదాలు. సంజయ్ నాకు కథ చెప్తాడని ఒక ఫ్రెండ్ ఫోన్ చేసినప్పుడు నిజంగా నేను నమ్మలేదు. నిజంగానే తను వచ్చి నాకు చెప్పాడు. చాలా సర్‌ప్రైజ్ అయ్యాను. ఈ సినిమాకి కథ ఎవరికైనా ముందే చెప్పావా అని అడిగాను. తనకు దుల్కర్‌కి చెప్పానని చెప్పాడు. కానీ అక్కడ ఉన్న బిజీ వల్ల అతనికి కుదరలేదు. మరి నాకెందుకు? నేనే ఎందుకు? అని అడిగితే అప్పుడు తను ఇచ్చిన సమాధానం.. నా 16 ఏళ్ల కెరీర్‌లో నేను పడిన కష్టానికి తగిన ఫలితం అనే ఆనందంగా అనిపించింది. తను నాకు ఒక తమ్ముడిలాంటి వాడు. 'సిగ్మా' ఫన్, యాక్షన్, కామెడీ. అలాగే యాక్షన్ కూడా చాలా బాగుంటుంది. యాక్షన్ రెగ్యులర్‌గా ఉండదు. చాలా యూనిక్‌గా ఉంటుంది. ఓవర్ బిల్డప్ ఉండదు. 70 రోజుల్లో తీస్తానని చెప్పి 63 రోజుల్లోనే తను అనుకున్నది అనుకున్నట్టుగా పూర్తి చేశాడు. ప్రొడ్యూసర్లు ఆల్రెడీ టేబుల్ ప్రాఫిట్‌లో ఉన్నారు. తమన్ గారు చాలా బాగా డ్యూటీ చేశారు. మీరు థియేటర్‌లో చాలా ఎంజాయ్ చేస్తారు. స్పీకర్లు పగులుతాయి. ఇది నా సినిమా లేదా విజయ్ గారి అబ్బాయి సినిమా అని కాదు. స్వయంకృషితో, తన కష్టం మీద తానే నిలబడతానని ఒక 24 ఏళ్ల దర్శకుడి కల తప్పకుండా ఈ సినిమా మీరందరూ థియేటర్‌లో చూడండి. ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారు.

డైరెక్టర్ జేసన్ సంజయ్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. మా సినిమాకి సపోర్ట్ చేయడానికి వచ్చిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఇది సినిమా యాక్షన్ అడ్వెంచర్ ఫిల్మ్. హీస్ట్, ట్రెజర్ హంట్ లాంటి కొత్త ఎలిమెంట్స్ ఉన్నాయి. ప్రతి ఒక్కరూ సినిమాకి కనెక్ట్ అవుతారు. 'సిగ్మా' టీమ్ అందరికీ థాంక్యూ. నన్ను నమ్మి ఈ సినిమా చేసిన సందీప్‌కి థాంక్యూ. ఫారియాకి ఈ సినిమా తమిళ్‌లో మెమరబుల్ అవుతుందని నమ్ముతున్నాను. అలాగే ఈ సినిమాలో పనిచేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు. తెలుగులో రిలీజ్ చేస్తున్న మైత్రీ మూవీ మేకర్స్‌కి థాంక్యూ. అక్టోబర్ 2న మీ అందరి ఫీడ్‌బ్యాక్ కోసం ఎదురుచూస్తున్నాను. తమన్ గారికి థాంక్యూ. చాలా అద్భుతమైన, కొత్త ఆల్బమ్ ఇచ్చారు. ఇది చాలా మెమొరబుల్ ప్రాజెక్ట్ అవుతుంది. మెగాస్టార్ చిరంజీవి గారికి కృతజ్ఞతలు. ఆయన ఎంత బిజీ షెడ్యూల్‌లో ఉన్నప్పటికీ మా కోసం సమయం తీసుకుని, నా లాంటి డెబ్యూ ఫిలిం మేకర్‌ని సపోర్ట్ చేయడానికి వచ్చారు. ఆయన మా అందరికీ ఇన్‌స్పిరేషన్. ఆయన ఈ సినిమా చూడాలని కోరుకుంటున్నాను.

మ్యూజిక్ డైరెక్టర్ తమన్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ముందుగా లైకా ప్రొడక్షన్స్‌కి థాంక్యూ. ఈ సినిమా నాకు చాలా స్పెషల్ ఫిలిం. విజయ్ గారితో నేను 'వారిసు' సినిమా చేశాను. ఇప్పుడు సంజయ్ సినిమాకి మ్యూజిక్ చేయడం హ్యాపీగా ఉంది. ఇది నాకు చాలా పెద్ద బాధ్యత. తను చాలా అనుభవం ఉన్న దర్శకుడిలా సినిమా తీశాడు. ఈ సినిమాలో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ చాలా అద్భుతంగా ఉంటుంది. సంజయ్‌లో చాలా క్లారిటీ ఉంది. చాలా డౌట్ ఎంత పర్సన్. తనలో చాలా వాల్యూస్ ఉన్నాయి. తను మనిషిగా నాకు చాలా ఇష్టం. మెగాస్టార్ తో ఒక మంచి కమర్షియల్ సినిమాకి పనిచేయడం ఎప్పటినుంచో ఉంది. అది కాకాతో తీరబోతుంది. 'బ్రూస్ లీ'లో నాకు ఒక పది నిమిషాలు చేసే అవకాశం వచ్చింది. ఇప్పుడు పూర్తి సినిమా చేసే అవకాశం దక్కింది. మెగాస్టార్ అభిమానులందరికీ మాట ఇస్తున్నాను.. మాట నిలబెట్టుకుంటాను. ఈరోజు కూడా ఉదయం నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు షూటింగ్ చేసి ఆయన ఈ వేడుకకు వచ్చారు. ఆయన కమిట్‌మెంట్‌కి హ్యాట్సాఫ్ చెప్పాలి. మా గుండెల్లో ఉన్న ప్రేమను జనవరిలో చూస్తారు.

నిర్మాత నవీన్ ఎర్నేని మాట్లాడుతూ. అందరికీ నమస్కారం. ఈ వేడుకకు వచ్చిన చిరంజీవి గారికి ధన్యవాదాలు. ట్రైలర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. టీమ్ అందరికీ గుడ్ లక్. డెఫినెట్‌గా ఈ సినిమా చాలా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను.

హీరోయిన్ ఫారియా అబ్దుల్లా మాట్లాడుతూ. చిరంజీవి గారిని ఎప్పుడు కలిసినా నాలో ఉన్న డాన్సర్ బయటికి వస్తుంది. అంతగా ఇన్‌స్పైర్ చేసిన చిరంజీవి గారికి థాంక్యూ. ఆయన ఈ వేడుకకు రావడం చాలా ఆనందంగా ఉంది. 'సిగ్మా' యాక్షన్-అడ్వెంచర్ కమర్షియల్ ఎంటర్టైనర్. మీరందరూ ఫ్యామిలీతో కలిసి చూడొచ్చు. సినిమా కోసం నేను చాలా ఎక్సైటెడ్‌గా ఎదురుచూస్తున్నాను. ఈ సినిమాతో తమిళ్ ఇండస్ట్రీలోకి వెళ్లడం చాలా ఆనందంగా ఉంది. సంజయ్ సినిమాని చాలా అద్భుతంగా తీశాడు. అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. అక్టోబర్ 2న సినిమా రిలీజ్ అవుతుంది. తప్పకుండా మీ అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నాను.

చోటా కె. నాయుడు మాట్లాడుతూ. అందరికీ నమస్కారం. చిరంజీవి గారు ఈ వేడుకకు రావడం చాలా ఆనందంగా ఉంది. సందీప్‌ని ఎప్పుడు కలవడానికి వెళ్లినా కొత్త కాన్సెప్టులు, కొత్త కొత్త ఐడియాలు చెప్తుంటాడు. తను సినిమా తప్పితే ఇంకేమీ మాట్లాడడు. తను ఇంత పాషన్ గా పని చేయడం నిజంగా చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాకి పనిచేసిన మిగతా టెక్నీషియన్స్ అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్. తొలిసారి డైరెక్షన్ చేస్తున్న సంజయ్‌కి ఆల్ ది బెస్ట్. ఈ సినిమా చాలా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను.

ఎస్కేఎన్ మాట్లాడుతూ. చిరంజీవి గారు ఎన్నో సినిమాలకి సపోర్ట్ చేస్తూ విజయంలో భాగస్వామి అయ్యారు. ఆయన ప్రత్యేకంగా సినిమాలను సపోర్ట్ చేయడానికి అంటూ కొన్ని డేట్స్‌ను కేటాయించుకుంటారు. సందీప్ కిషన్ గారు టాలెంట్ ఉన్న దర్శకులను ప్రోత్సహించడంలో ముందుంటారు. అలాగే ఆయన అప్‌కమింగ్ టాలెంట్‌కి ఎప్పుడూ సపోర్ట్ చేస్తారు. ఆయన మంచి మనసుకు ఈ సినిమా రెండు భాషల్లో చాలా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను. జేసన్ అనుకుంటే వందో మెట్టు నుంచి ఆయన జర్నీ స్టార్ట్ చేయగలరు. కానీ ఆయన మొదటి అడుగు నుంచి దర్శకత్వంతో మొదలుపెట్టడం చాలా గొప్ప విషయం. అక్కడే ఆయన మనసులు గెలిచారు. విజయ్ గారి స్థాయికి జేసన్ కూడా వెళ్లాలని కోరుకుంటున్నాను.

సాయి రాజేష్ మాట్లాడుతూ.. చిరంజీవి గారు ఈ వేడుకకు రావడం చాలా సంతోషంగా ఉంది. సందీప్ గారు కష్టపడే వాళ్లకి ఇప్పుడు సపోర్ట్‌గా ఉంటారు. మా 'హృదయ కాలేయం' సినిమాకి ఆయనే గెస్ట్‌గా వచ్చారు. సందీప్ గారి విషయంలో నాకు ఎప్పుడూ కృతజ్ఞతలు ఉంటాయి. సంజయ్ గారు దర్శకత్వాన్ని ఎంచుకోవడం చాలా సంతోషకరం. టీమ్ అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్. సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను.

మిర్చి సంపత్ మాట్లాడుతూ.. చిరంజీవి గారు ఈ వేడుకకు రావడం చాలా ఆనందంగా ఉంది. సందీప్ కిషన్ అద్భుతమైన నటుడు. జేషన్ ఈజీగా హీరో అయిపోవచ్చు. కానీ తను కష్టమైనా దర్శకత్వం వైపు వచ్చాడు. ఈ సినిమాని చాలా అద్భుతంగా డైరెక్ట్ చేశాడు. బౌండ్ స్క్రిప్ట్ రాసుకున్నాడు. ఆ స్క్రిప్ట్ నుంచి బయటికి వెళ్లలేదు. ఈ సినిమా అక్టోబర్ 2న వస్తుంది. తప్పకుండా థియేటర్‌లో చూసి పెద్ద విజయం చేయాలని కోరుకుంటున్నాను.

యాక్షన్ కొరియోగ్రాఫర్ వెంకట్ మాట్లాడుతూ.. జేసన్ అందరితో ఎంతో మర్యాదగా, ప్రేమగా ఉంటారు. నేను దర్శకత్వం చేస్తున్న సినిమా సెట్‌కి వచ్చి నాకు బెస్ట్ విషెస్ అందించాడు. తనకు చాలా సహనం ఎక్కువ. నా ఫస్ట్ హిట్ సందీప్ కిషన్ 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్'తోనే వచ్చింది. 'సిగ్మా' తప్పకుండా మీ అందరినీ అలరిస్తుంది.


కృష్ణ చైతన్య మాట్లాడుతూ..'సిగ్మా' సినిమాలో పాట రాయడం చాలా ఆనందంగా ఉంది. సంజయ్ చాలా క్లారిటీ ఉన్న దర్శకుడు. సందీప్ సినిమాలు చాలా యూనిక్‌గా ఉంటాయి. ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. తప్పకుండా ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను.

రాకేందు మౌళి మాట్లాడుతూ.. ఈ సినిమా రెండు పాటలు రాశాను. జేసన్ దర్శకత్వం వైపు రావడం చాలా హ్యాపీగా ఉంది. సందీప్ నాకు ఎంతో మంచి స్నేహితుడు. తమన్ గారు అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ట్రైలర్ చాలా ఆసక్తికరంగా ఉంది. అక్టోబర్ 2న తప్పకుండా ఈ సినిమా మీ అందరినీ ఎంటర్టైన్ చేస్తుంది.

తమిళ్ కుమరన్ మాట్లాడుతూ..అందరికీ నమస్కారం. 'సిగ్మా' మాకు చాలా స్పెషల్ మూవీ. జేసన్ చాలా మంచి విజన్‌తో తీశాడు. సినిమా విషయంలో చాలా హ్యాపీగా ఉన్నాము. సంజయ్‌కి మీ అందరి ప్రేమ, ఆదరణ కావాలి. ఈ సినిమాని తెలుగులో రిలీజ్ చేస్తున్న మైత్రీ మేకర్స్, ఎన్వి ప్రసాద్ గారికి ధన్యవాదాలు. తప్పకుండా ఈ సినిమా మీ అందరినీ అలరిస్తుంది. ఈ వేడుకలో సినిమా యూనిట్ అందరూ పాల్గొన్నారు.



**నాంపల్లి గాంధీభవన్ ప్రజాబలం ప్రతినిధి:** గాంధీభవన్ లో శనివారంనాడు మాజీ ప్రధాని డా॥ మన్‌మోహన్‌సింగ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళర్పించిన నిర్మల్ కూమార్ యాదవ్ , శ్రీనివాస్, వెంకటేష్ ,మొహమ్మద్‌గౌస్, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

## తెలంగాణలో నాటి నిజాం, రజాకార్ల పాలనను తలపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం: మాజీ ఎంపీ డా. బూర నర్సయ్య గౌడ్

హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి: హైద్రాబాద్ సెప్టెంబర్ 26:తెలంగాణ వీరత్వానికి, పౌరుషానికి, ఆత్మగౌరవ పోరాటానికి చిరునామా వీరనారి చాకలి ఐలమ్మ అని, నాటి నిరంకుశ నిజాం, రజాకార్లు, విస్నూర్ దొరల గడీల పాలనపై ఎదిరించి పోరాడిన ఆమె చరిత్ర యావత్ దేశానికే స్ఫూర్తిదాయకమని భారతీయ జనతా పార్టీ నాయకులు కొనియాడారు. నాడు దొరలు, నిజాం సాగించిన భూదోపిడీ, అణచివేతలే నేడు కాంగ్రెస్ పాలనలో సరికొత్త రూపంలో పునరావృతమవుతున్నాయని, కాలం మారినా పాలకుల దోపిడీ వ్యవస్థలు మారలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.





తెలంగాణలో బహుజనుల, బలహీన వర్గాల ఆత్మగౌరవానికి భరోసా కేవలం బీజేపీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చిట్యాల (చాకలి) ఐలమ్మ జయంతి వేడుకలను బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 'సాధిద్దాం సాధిద్దాం.. ఐలమ్మ ఆశయాలు సాధిద్దాం', 'బీసీల ఐక్యత వర్ధిల్లాలి' అంటూ కార్యకర్తల నినాదాలతో పార్టీ కార్యాలయం మార్మోగింది.

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ డా. బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ... ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "దున్నేవాడిదే భూమి.. పండించేవాడిదే పంట" అని లక్షా యాభై వేల ఎకరాలున్న విస్నూర్ రామచంద్రారెడ్డి లాంటి దొరను ఢీకొట్టిన బీసీ వీరనారి ఐలమ్మ అని గుర్తుచేశారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో ప్రధాని నరేంద్ర మోదీ గారు ఐలమ్మ త్యాగాలను దేశవ్యాప్తంగా చాటారన్నారు. అయితే తెలంగాణలో కాలం మారినా పాలనా వ్యవస్థల తీరు మారలేదని విమర్శించారు. నాడు నిజాం, రజాకార్లు, దొరలు ఉంటే.. నేడు వారి స్థానంలో ఎంఐఎం, కాంగ్రెస్ గడీల దొరలు చేరారని మండిపడ్డారు. రూ.6 లక్షల కోట్ల దోపిడీకి 'హిల్ట్' పాలసీ తెచ్చారని, కోటి ఎకరాల అసైన్డ్, పేదల భూములను 22-ఎ కింద వేధించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ధరణి పేరుతో, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారులో భూభారతిలతో పేదల భూములను కాజేస్తున్నారని, పహానీలలో అనుభవదారుడి కాలమ్ తొలగించి పేదలకు తీరని అన్యాయం చేశారని పేర్కొన్నారు. హైడ్రా పేరుతో మధ్యతరగతి బిల్డర్లను భయభ్రాంతులకు గురిచేసి, పెద్ద రియల్టర్లకు రహదారి వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడే సర్వాయి పాపన్న, కొండా లక్ష్మణ్ బాపూజీ, చాకలి ఐలమ్మ కలలుగన్న సామాజిక తెలంగాణ సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. బీజేపీ అధికారంలోకి రాగానే హైదరాబాద్ ట్యాంక్ బండ్ లేదా నెక్లెస్ రోడ్డుపై చాకలి ఐలమ్మ విగ్రహాన్ని సగౌరవంగా ప్రతిష్ఠిస్తామని పార్టీ తరపున హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్ర సహ ఇంచార్జ్, బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.కాసం వెంకటేశ్వర్లు, బీజేపీ రాష్ట్ర.వకులాభరణం కృష్ణమోహన్ రాష్ట్ర , జిల్లా నాయకులు, ఓబీసీ మోర్చా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనం సంధర్భంగ గ్రేటర్ వారాసిగుడ పద్మశాలి సంఘం ఆద్వర్యం ఘనంగా ప్రసాదం పంపిణి



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి హైద్రాబాద్ సెప్టెంబర్ 26 :గణేష్ నిమజ్జనం సంధర్భంగ గ్రేటర్ వారాసిగుడ పద్మశాలి సంఘం అధ్యక్షులు గోలి జనార్ధన్ ఆధ్వర్యంలో 15వ ఏటా నిర్వహించిన ప్రసాదం పంపిణి ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం లో గ్రేటర్ వారాసిగుడ పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షులు బొమ్మ నరేందర్,సుంకు రాంచందర్, కత్తుల సధర్శన్, రుద్ర భాస్కర్, గంజి యాదగిరి,బల్ల గీత, చార్మినార్ నియోజకవర్గ ఏసీపీ రుద్ర భాస్కర్ , ఈ సందర్బంగా బొమ్మ నరేందర్ మాట్లడుతు హిందువులకు ఆరాధ్య దైవం ముక్కోటి దేవతలకు అధిపతి, పూజల్లో ప్రథమ పూజకు అర్హులు మేకల హర్ష కీర్తి, కిరణ్ మాట్లాడుతు గ్రేటర్ వారాసిగుడ సంఘం ఎంతో ఆదర్శనీయం అని అన్నారు.

బౌద్ధనగర్ లోని పద్మశాలి సంఘాలలో గ్రేటర్ పద్మశాలి సంఘానికి ఎంతో గుర్తింపు ఉంది.



# కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమోషన్లలలో రిజర్వేషన్లు కల్పించాలి

## బి.సి ఉద్యోగ సంఘాల డిమాండ్.

కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమోషన్లలలో రిజర్వేషన్లు కల్పిందాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం వివిధ శాఖలకు చెందిన బి.సి ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బి.సి ఉద్యోగుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి అల్లం యాదయ్య అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి కేంద్ర- రాష్ట్ర వివిధ శాఖల ముఖ్య నాయకులూ హాజరయ్యారు. ఈ సమావేశానికి ముఖ్యాతిధిగా వాల్లన్న అం. కృష్ణయ్య హాజరై ప్రసంగించారు.



ఈ సమావేశంలో ఈ క్రింది తీర్మానాలను ఆమోదించారు

బి.సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలని, బి.సి ల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్ల పై ఉన్న క్రిమి లేయర్ ను తొలగించాలని,

కేంద్ర విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను బి.సి ల జనాభా ప్రకారం 27 శాతం నుండి 56 శాతం కు పెంచాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలో పని చేసే ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలనీ సమావేశం డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలని కోరారు.

ఈ సమావేశంలో బి.సి నాయకులూ జాతీయ బి.సి ఉద్యోగుల సంఘం వైస్ ప్రెసిడెంట్ ఎం. శ్రీనివాస్ రావు, రాష్ట్ర బి.సి ఉద్యోగుల సంఘం ఓర్గానేజింగ్ సెక్రటరీ కోట పిచ్చయ్య, గ్రేటర్ హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్ గిరిధర్ రావు, రామాంజనేయులు, నవీన్ సాగర్ ఇంకా శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇంజెక్షన్ల నాణ్యతకు కేంద్ర పర్యవేక్షణ

## (సి.హెచ్. ప్రతాప్)

రోగి ప్రాణాలను కాపాడాల్సిన ఇంజెక్షనే నాణ్యత లోపంతో ప్రమాదానికి కారణమైతే అది సాధారణ తయారీ లోపంగా తీసుకునే విషయం కాదు. ఈ నేపథ్యంలో ఇంజెక్షన్లు సహా స్టెరైల్ ఔషధాల తయారీ అనుమతులను దేశవ్యాప్తంగా ఒకే కేంద్ర నియంత్రణ వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలన్న ప్రతిపాదన ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం పలు ఔషధాల లైసెన్సింగ్ బాధ్యతలు రాష్ట్ర స్థాయి సంస్థల వద్ద ఉండగా, అధిక ప్రమాదం కలిగిన స్టెరైల్ ఉత్పత్తులపై మరింత కఠినమైన, ఏకరీతి పర్యవేక్షణ అవసరమన్న అభిప్రాయం బలపడుతోంది.

2025--26 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా పరీక్షించిన ఇంజెక్షన్, స్టెరైల్ ఔషధ నమూనాల్లో సుమారు 240 ప్రమాణాలకు తగ్గట్టుగా లేవని గుర్తించడం ఆందోళన కలిగించింది. హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లో జరిగిన పరీక్షల్లో లోపాలు బయటపడటం నియంత్రణ వ్యవస్థలో ఉన్న అసమానతలను మరోసారి వెలుగులోకి తెచ్చింది. కొన్ని రాష్ట్రాల్లో తయారీ కేంద్రాల తనిఖీలు, సాంకేతిక ఆడిట్లు కఠినంగా జరుగుతుండగా, మరికొన్ని చోట్ల అదే స్థాయి అమలు లేకపోవడం వల్ల నాణ్యత లోపాలున్న ఉత్పత్తులు సరఫరా వ్యవస్థలోకి చేరే ప్రమాదం ఉంది.

సాధారణ మాత్రలతో పోలిస్తే ఇంజెక్షన్లు, వ్యాక్సిన్లు, ఇంట్రావీనస్ ద్రావణాలు మరింత సున్నితమైనవి. ఇవి నేరుగా శరీరంలోకి చేరుతాయి. సూక్ష్మజీవుల కలుషితం, తయారీలో చిన్న లోపం, మోతాదులో తేడా కూడా తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. అందువల్ల ముడిపదార్థాల నుంచి తయారీ వాతావరణం, స్టెరిలిటీ నిర్ధారణ, బ్యాచ్ విడుదల వరకు ప్రతి దశలో కఠిన నియంత్రణ అవసరం.

ప్రతిపాదిత కేంద్ర లైసెన్సింగ్ విధానం అమల్లోకి వస్తే దేశంలోని ప్రతి స్టెరైల్ ఔషధ తయారీ కేంద్రం ఒకే ప్రమాణాలకు లోబడాల్సి ఉంటుంది. తెలంగాణలోని ఔషధ పరిశ్రమ కూడా ఇదే సమగ్ర వ్యవస్థ పరిధిలోకి వస్తుంది. దీనివల్ల రాష్ట్రాల మధ్య తనిఖీల తీవ్రతలో ఉండే తేడాలు తగ్గి, నాణ్యత నియంత్రణకు ఒకే ప్రమాణం ఏర్పడే అవకాశం ఉంది.

అయితే లైసెన్సింగ్‌ను కేంద్రీకరించడం ఒక్కటే సరిపోదు. రాష్ట్ర ఔషధ నియంత్రణ విభాగాల సామర్థ్యాన్ని పెంచడం, ప్రయోగశాలలను ఆధునికీకరించడం, లోపభూయిష్ట బ్యాచ్‌లను వెంటనే వెనక్కి పిలిపించే వ్యవస్థను బలోపేతం చేయడం కూడా అంతే ముఖ్యం.

ఔషధ నాణ్యత అనేది కేవలం పరిశ్రమ ప్రమాణం కాదు; అది రోగి ప్రాణానికి సంబంధించిన బాధ్యత. అందుకే ఇంజెక్షన్ల విషయంలో తయారయ్యాక పరీక్షించడం కంటే, తయారీ దశ నుంచే నిరంతర పర్యవేక్షణే అత్యంత భద్రమైన మార్గం.

# చౌటుప్పల్ప్రపంచ పర్యావరణ ఆరోగ్య సదస్సు



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి: చౌటుప్పల్ సెప్టెంబర్26 చౌటుప్పల్ మండలంలోని నేలపట్ల గ్రామంలో ప్రపంచ పర్యావరణ ఆరోగ్య సదస్సు నిర్వహించారు.

"వినీల ఆకాశం-స్వచ్ఛమైన గాలి" అంశం గురించి విద్యార్థులకు వివరించనైనది. ఈ కార్యక్రమం పాల కుర్ల శివయ్య గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగింది.

విద్యార్థులకు నీతి కథల పుస్తకాలు, గృహస్థులకు భగవద్గీత గ్రంథాలు ఫౌండేషన్ చైర్మన్ పాలకుర్ల మురళి గౌడ్ అందజేశారు. ధర్మబద్ధమైన జీవనం వల్ల పర్యావరణమునకు మేలు జరుగుతుందని ఈ సందర్భంగా అన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త బడుగు శ్రీరాములు, సహ చట్టం జిల్లా అధ్యక్షులు దబ్బటి శేఖర్, సంఘ నాయకులు కమలాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు మండలంలోని నేలపట్ల గ్రామంలో ప్రపంచ పర్యావరణ ఆరోగ్య సదస్సు నిర్వహించడమైనది.

"వినీల ఆకాశం-స్వచ్ఛమైన గాలి" అంశం గురించి విద్యార్థులకు వివరించనైనది. ఈ కార్యక్రమం పాల కుర్ల శివయ్య గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగింది.

విద్యార్థులకు నీతి కథల పుస్తకాలు, గృహస్థులకు భగవద్గీత గ్రంథాలు ఫౌండేషన్ చైర్మన్ పాలకుర్ల మురళి గౌడ్ అందజేశారు. ధర్మబద్ధమైన జీవనం వల్ల పర్యావరణమునకు మేలు జరుగుతుందని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త బడుగు శ్రీరాములు, సహ చట్టం జిల్లా అధ్యక్షులు దబ్బటి శేఖర్, సంఘ నాయకులు కమలాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు



# వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఘన నివాళులు

## ఎస్పీ డి.జానకి

మహబూబ్ నగర్ తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా మహబూబ్నగర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి జిల్లా ఎస్పీ డి.జానకి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలకు, ఆత్మగౌరవానికి, సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన మహనీయురాలని అన్నారు. అన్యాయం, అణచివేతకు వ్యతిరేకంగా ఆమె చూపిన పోరాట పటిమ, ధైర్యం, పట్టుదల సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని, ఆమె ఆశయాలు మరియు పోరాట స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీసీఆర్బీ డీఎస్పీ రమణారెడ్డి, ఏఓ రుక్మిణీ భాయ్, ఎస్బీ ఇన్స్పెక్టర్ మోతిరామ్, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్, ఆర్ఎస్ఐలు, కార్యాలయ సూపరింటెండెంట్లు మధు, బాలరాజు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ప్యారసాని సురేష్, మరియు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# మర్పల్లి మండల ఉత్తమ ఉపాధ్యాయులకు ఎంపీడీవో ,ఎంఈఓ, ఘనంగా సన్మానించారు



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్ 26(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా ఘన సన్మానం చేసిన మర్పల్లిఎంపీడీవో శాంతమ్మ, మర్పల్లి విద్యాధికారి బి అశోక్, తెలిపారు అదే విధంగా మర్పల్లి మండల స్థాయిలో 14 గురు ఉత్తమటీచర్స్ ఉపాధ్యాయులకు మండల స్థాయిలో ఘనంగా సన్మానించడం జరిగిందని విద్యాధికారి బి అశోక్ తెలిపారు ఉపాధ్యాయులుజిల్లా స్థాయిలో 7గురుటీచర్స్ఉపాధ్యాయులు జిల్లా కలెక్టర్



మరియు డీఈవో ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగిందని తెలిపారుమర్పల్లి సిఆర్పి మల్లేష్ కి ఉత్తమ అవార్డు సన్మానం చేయడం జరిగిందనిఎంపీడీవో శాంతమ్మ, మర్పల్లి విద్యాధికారి బి అశోక్,తెలిపారు ఉపాధ్యాయులు అంటేనే అపూర్వమైన విలువైన ఉత్తమమైన ఉద్యోగం ఉపాధ్యాయుల చేతుల్లో డాక్టర్లు కావచ్చు ఐఏఎస్ కావచ్చు ఐపీఎస్ కావచ్చు ఇంజనీర్లు కావచ్చు సైంటిస్టులు కావచ్చు ఇలాగా నవ సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులు స్ఫూర్తి వారు గ్రామాల్లో బడుగు బలహీన వర్గాల నిరుపేద విద్యార్థులకు చక్కటి విద్యాభ్యాసాన్ని అందించి వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసి పట్టుదలతో లక్ష్యసాధనలో ముందుకెళ్లాలని జ్ఞానమనే సంపద విద్యార్థుల్లో నింపి గొప్ప సర్వే చేసేవారు ఎవరైనా ఉన్నారు అంటే అది కేవలం ఉపాధ్యాయులే మరుపల్లి మండలంవిద్యాధికారి బి అశోక్ తెలిపారు ఉపాధ్యాయుల సన్మాన సభ కార్యక్రమంలో విద్యార్థులు చక్కటి నృత్యాలు చేస్తూ టీచర్స్ ని పేరెంట్స్ ని ఆనంద పరవశులు చేసి విద్యార్థుల కు చక్కగా బోధించిన ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం చేయడం జరిగింది అలాగే మండలంలో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్క టీచర్ కి ఉపాధ్యాయులకికార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా శుభాకాంక్షలు తెలియపరుస్తున్నాను అని మర్పల్లి మండల విద్యాధికారి బి అశోక్ తెలిపారు

## జీ9 బొగ్గుని ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు తరలిస్తున్న సీఎం రేవంత్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి




హైదరాబాద్ సీఎం రేవంత్ రెడ్డి జీ9 బొగ్గుని ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు తరలిస్తున్నారు. నేను మాట్లాడేది అబద్ధమైతే.. నిరూపించమని రుజువు చేయాలని సవాల్ చేస్తున్నానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. ఉత్పత్తి అవుతున్న బొగ్గుని రికార్డుల్లో చూపించకుండా దొంగతనంగా అమ్ముకుంటున్నారు. సీఎం ఆడుతున్న డ్రామాల వల్లే.. తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి తగ్గిపోయిందని అన్నారు.

బొగ్గు గ్రేడ్ తక్కువగా ఉండటం వల్ల ప్లాంట్ నడవదు అనేది శుద్ధ అబద్ధం. 6 నుంచి 15 వరకు ఏ గ్రేడ్ బొగ్గు వచ్చినా.. అద్భుతంగా విద్యుత్ను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఈ రాష్ట్రంలోని అన్ని ప్లాంట్లకు ఉంది. ఉత్పత్తిలో హెచ్చుతగ్గులు ఉండొచ్చేమో గానీ.. ప్లాంట్ నడవదు అనే సమస్య ఉండదు. ప్రజలను పక్కదారి పట్టించేందుకే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్ధాలు మాట్లాడుతున్నారు. సింగరేణిలో జీ9 బొగ్గు లేదని రేవంత్ రెడ్డి చెప్పిన మాట పచ్చి అబద్ధం. ఈరోజు కూడా 13 గనుల్లో జీ9 బొగ్గు ఉత్పత్తి జరుగుతోందని అన్నారు.

కానీ.. 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గుని రికార్డుల్లో చూపించకుండా దొంగతనంగా అమ్ముకున్నారు కాంగ్రెస్సోళ్లు. జీ9 బొగ్గును గురువు చంద్రబాబు, ఫ్రెండ్ శివకుమార్లకు సప్లై చేస్తూ.. ఇక్కడ నాసిరకం బొగ్గు ఇస్తున్నారు సీఎం అని అన్నారు.

## నిమజ్జనం ప్రశాంతం..అందరికి థాంక్స్ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్



హైదరాబాద్ గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా పూర్తి అయింది. నిమజ్జనం కు సహకరించిన అందరికి ధన్యవాదాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ అన్నారు. శనివారం నాడు అయన సెక్రటేరియట్ దగ్గర మీడియాతో మాట్లాడారు.

సీపి మాట్లాడెఉతూ ఖైరతాబాద్ నిమజ్జనంను చూసేందుకు ప్రజలకు – దేశ విదేశాల యాత్రికులకు ధన్యవాదాలు. విగ్రహాలు ఎక్కువగా ఉండటం వల్ల నిమజ్జనం కొంత ఆలస్యంఅయింది. ఖైరతాబాద్ గణేష్ ను 30 లక్షలు, బాలాపూర్ 15 లక్షలు దర్శనం చేసుకున్నారు. నిమజ్జనం లో అక్కడక్కడా లోపాలను గుర్తించ్చాం.. లోపాలను వచ్చే నిమజ్జనం కు సరిదిద్దుతాం. పేపర్ షాట్ మిషన్లు వాడటం వల్ల నగరం అంతా చెత్త పడింది. వచ్చే ఏడాది వరకు పేపర్ షాట్ మిషన్ ను బ్యాన్ చేసేందుకు ప్రయత్నం చేస్తాం. అన్నధానం చేసిన వాళ్ళు చెత్తను ఎక్కడికక్కడ పడేసి వెళ్లారు. సరైన సమయం లో నిమజ్జనం టైం కు పూర్తి చేయడంలో సక్సెస్ కాలేదని అన్నారు.

నిమజ్జనంలో డ్రంక్ చేసి వచ్చారు... వల్గల్ డాన్స్ లు చేశారు. రాజకీయ పాటల పేరుతో వల్గల్ డాన్స్ లు చేస్తున్నారు.. అలాంటివి గుర్తించాం సోషల్ మీడియా పై స్పెషల్ ఫోకస్ పెట్టాం.. కేసుల లిస్ట్ ను త్వరలో బయటపెడుతామని అన్నారు.

# రేవంత్ రెడ్డిది చేతగానీ.. ఫెయిల్యూర్ సర్కార్

**ప్రభుత్వం పట్టిలేని తనంతో ఏటా 4 వేల మంది పసిపిల్లలు చనిపోతున్నారు**

**పరిపాలన చేతకాకపోతే పక్కకు తప్పుకోవాలి**

**విద్య, వైద్యం విషయంలో ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తున్నాం**

**తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**



హైదరాబాద్ ఆదిలాబాద్ లోని రిమ్స్ లో జరిగిన ఘటనపై బాధపడని వారుండరు. కేవలం ఈ ప్రభుత్వం పట్టిలేని తనం కారణంగానే పిల్లలు మాడిమసయ్యారు. వైద్యం, విద్య విషయంలో ప్రభుత్వం అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు.

ఈ రాష్ట్రంలో విద్య, వైద్య రంగాన్ని సరిచేసుకోవాల్సిన సమయం వచ్చింది. ఈ విషయంలో ప్రజలంతా కూడా బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఆదిలాబాద్ ఘటన తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వ హాస్పిటల్స్ ఉన్న పరిస్థితిపై ఒక మిత్రుడు డేటా పంపించాడు. ఆ డేటా చూసిన తర్వాత రెండు రోజుల పాటు నిద్రపట్టలేదు. అత్యంత భయంకరమైన చేదు వాస్తవాలు అందులో ఉన్నాయి. 2020-21 లో 6 వేలు, 2022-23 లో 4,933, 2024-25 లో 3,853 మంది పసిపిల్లలు చనిపోయారు. ఏ జిల్లాలో చూసిన సరే దాదాపు 2 వందల వరకు పిల్లలు చనిపోయిన పరిస్థితి వుందని అన్నారు.

న్యూయార్క్, డల్లాస్ చేస్తామన్న హైదరాబాద్ లో గతేడాది 1046 మంది పిల్లలు చనిపోయారు. అత్యంత హృదయ విదారకమైన సంఘటనలు ఈ నివేదికలో ఉన్నాయి . వైద్యానికి 10 శాతం బడ్జెట్ ఇస్తామని చెప్పి 5 శాతం మాత్రమే ఇస్తున్నారు. గతేడాది 13, 192 కోట్లు కేటాయిస్తే 9, 242 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ప్రభుత్వం 22 రూపాయలు ఖర్చు చేస్తే అందులో రూపాయి మాత్రమే వైద్యానికి ఇస్తున్నారు. కేటాయించిన బడ్జెట్ లోనే 3 వేల కోట్లు వాడలేదు. కానీ ఆ తర్వాత మళ్లీ 1900 కోట్లు కేటాయించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వాన్ని కాగ్ కడిగిపారేసింది. ఉన్న వాటిని ఖర్చు చేయకుండా మళ్లీ కేటాయింపులు ఎలా చేస్తారని ప్రశ్నించారు.

రాష్ట్రంలో 11 హెల్త్ స్కీమ్ లు ఉంటే 7 హెల్త్ స్కీమ్ లకు సున్నా బడ్జెట్ కేటాయించారు. ఆరోగ్యశ్రీ కి సంబంధించి 5 వందల కోట్లు బకాయిలు అలాగే పెండింగ్ లో ఉన్నాయి. నిమ్స్ లో ముఖ్యమంత్రి చెబితే గానీ బెడ్ దొరికే పరిస్థితి లేదు. సర్జరీ కావాలంటే దాదాపు 7 నెలల సమయం వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది. నీలోఫర్ హాస్పిటల్ లో 2 వందల శాతం బెడ్ ఆక్యుపెన్సీ ఉంటోంది. డాక్టర్లు, వైద్య సిబ్బంది శక్తికి మించి పనిచేస్తున్నారు. కలెక్టర్లు ఎందుకు ప్రభుత్వ హాస్పిటల్స్, హాస్టళ్లను విజిట్ చేయటం లేదని ప్రశ్నిస్తున్నా. చిన్న జిల్లాలే కదా? మీరు విజిట్ చేస్తే పరిస్థితి మారుతుంది కదా? ఈ ప్రభుత్వానికి పరిపాలన చేతకాకపోతే పక్కకు తప్పుకోండి. ఇంత మంది పిల్లలు చనిపోతే కనీసం మానవత్వం లేదా? ఆరోగ్యశ్రీకి 7 వందల కోట్లు కేటాయిస్తే 140 కోట్లు మాత్రమే ఖర్చుచేశారు. రిమ్స్ ఘటన జరగటంతో హెల్త్ మినిస్టర్ ఆదిలాబాద్ వెళ్లారు.. కానీ గత మూడేళ్లలో ఎప్పుడు ఆయన ఆదిలాబాద్ జిల్లా కే వెళ్లలేదని అన్నారు.

రిమ్స్ హాస్పిటల్ లో చాలా దారుణంగా పరిస్థితులు ఉన్నాయి. ప్రతిపక్షాలు, మంత్రులు వెళ్తున్న ఈ సమయంలో కూడా హాస్పిటల్ లో పరిస్థితులు అలాగే ఉన్నాయి. పైగా వచ్చిన రోజు హెలికాప్టర్ లో ఇంధనం అయిపోందని గొడవపడ్డాడే తప్ప..ప్రజల కోసం కలెక్టర్ తో మాట్లాడలేదు. ఇక నుంచి మేము ప్రతి జిల్లాలో గవర్నమెంట్ హాస్పిటల్ కు వెళ్తాం. మీ ప్రాంతంలో ఉన్న ప్రతి హాస్పిటల్ కు వెళ్లి అక్కడ పరిస్థితులను ఫోటోలు తీసి ప్రశ్నించాలని ప్రజలను, యువతను కోరుతున్నా. ఈ ప్రభుత్వం తోలు తీసైనా సరే పరిస్థితులను మనమే బాగుచేసుకుందాం. ఆడపిల్లల ఆరోగ్యం కూడా క్షీణిస్తోంది. శానిటరీ ప్యాడ్స్ పడేసేందుకు కూడా జాగ లేని పరిస్థితి ఉంది. రాష్ట్రంలో చాలా స్కూళ్లలో బాత్ రూమ్ లు కూడా లేని పరిస్థితి ఉంది. టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వెళ్లి స్కూళ్లలో చూడండి. బాత్ రూమ్ లు లేని స్కూల్స్ ఉంటే మనమే చందా వేసుకొని కట్టిద్దాం. ఐటీడీఏలో 3 వందల కోట్లు ఉన్నప్పటికీ ఈ ప్రభుత్వం వాడుకోవటం లేదు. రేవంత్ రెడ్డిది చేతగానీ, ఫెయిల్యూర్ సర్కార్ . విద్య, వైద్యం మీద ఫోకస్ చేస్తూ ప్రభుత్వం మీద యుద్ధం ప్రకటిస్తున్నాం.నా ఫామ్ హౌస్ లో గజం భూమి కూడా కబ్జా ల్యాండ్ లేదు. ఎఫ్టీఎల్ లో కూడా లేదు. చట్టానికి లోబడే ప్రతి పైసా సంపాదించుకున్నాను. భవిష్యత్ లోనూ అలాగే ఉంటాను. అఫిడవిట్ లో ఉన్న దానికన్నా రూపాయి ఎక్కువ చూపించినా వారికే ఆ ఆస్తి ఇచ్చేస్తాను. ఈ ముఖ్యమంత్రి పరిపాలన చేతకాక డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నాడని ఆరోపించారు.

## ఔటర్ పై ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి




మేడ్చల్ కీసర శామీర్పేట మార్గంలో కూలీలతో వెళ్తున్న అశోక్ లేలాండ్ వాహనం వెనుక టైరు పేలి అదుపుతప్పి పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో మంగీలాల్ (60), సురేఖ (40) మృతి చెందగా.. మరో 11 మంది కూలీలకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కీసర పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 190 మంది ట్రైనీ కానిస్టేబుళ్ల పాసింగ్ ఔట్ పరేడ్

ఒంగోలు ప్రకాశం జిల్లా ఒంగోలులోని కొత్తమామిడిపాలెం జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్ నందు 2025 బ్యాచ్ కు చెందిన ాఉఖఅ (అతిలతిశ్రీ-ఎవని) 190మంది ట్రైనీ కానిస్టేబుళ్ల పాసింగ్ ఔట్ పరేడ్ కు సంబంధించిన రిహార్సల్స్ శుక్రవారం క్రమశిక్షణాయుత వాతావరణంలో నిర్వహించారు.

రిహార్సల్లో భాగంగా ట్రైనీ కానిస్టేబుళ్లు నిర్వహించిన కవాతు, ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, పరిశీలించారు. ట్రైనీ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

ప్రధాన పాసింగ్ ఔట్ పరేడ్ సందర్భంగా పాటించాల్సిన విధులు, పరేడ్ నిర్వహణ, సమన్వయం తదితర అంశాలపై సంబంధిత అధికారులకు మరియు ట్రైనీ కానిస్టేబుళ్లకు ఉన్నతాధికారులు పలు సూచనలు చేశారు.

సెప్టెంబర్ 26న జరగనున్న పాసింగ్ ఔట్ పరేడ్ కు ముఖ్యాతిథిగా ఏపి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ , ఏపి దేవాదాయశాఖ మంత్రి మరియు ప్రకాశం జిల్లా ఇంచార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి , ఏపి సోషల్ వెల్ఫేర్, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ శాఖ మంత్రి డోలా బాలా వీరాంజనేయ స్వామి, సౌత్ సెంట్రల్ జోన్ గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి , ప్రకాశం జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు , ప్రకాశం జిల్లా పి.టి.సి ప్రిన్సిపాల్ జీ.ఆర్. రాధిక ., ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు,అడిషనల్ ఎస్పీ (ఏఆర్)జీ. నాగేశ్వరరావు, ఒంగోలు డిఎస్పీ ఆర్. శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ శ్రీనివాసరావు,ట్రాఫిక్ సీఐ హజరత్తయ్య, ఆర్ఐలు రమణారెడ్డి,సీతారామిరెడ్డి, ఓ. రవికుమార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# సామూహిక సత్యనారాయణ వ్రతము జరిపిన వి ఆర్ 4 ట్రస్ట్



**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి**వి ఆర్ 4 సహయోగ్ చారిటేబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆనవాయితీగా కొన సాగిస్తున్న ఉచిత పూజా సామగ్రి సమకూరుస్తూ పౌర్ణిమ రోజున జరుపుతున్న సత్యనారాయణ స్వామి వ్రతము – ప్రస్తుత భాద్రపద మాసం పౌర్ణిమ శనివారం 26 సెప్టెంబర్ రోజున నార్సింగి మున్సిపల్ కౌన్సిల్ పరిధిలోని మణికొండ డివిజన్ మర్రి చెట్టు దగ్గరలో ఉన్న శివాలయంలో సామూహిక శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వ్రతము పూజారి మండువ మధుసూదన్ శర్మచే వినూత్న రీతిలో గణపతి పూజ, అమ్మవారి కుంకుమార్చన, నవగ్రహ, అష్టదిక్పాలకుల ప్రీతి పాత్రమైన ధాన్యాలతో పూజలు జరిపించిన అనంతరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వ్రతం జరుపబడెనని, ఇట్టి వ్రతంలో స్థానికులు, స్థానికేతరులు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి సంతృప్తి చెందడం జరిగిందనీ మేనేజింగ్ ట్రస్టీ అందె లక్ష్మణ్ రావు, దిలీపు కక్కడ, సుమ నలిని, హరీ హారనాథు రెడ్డి, మంజుల తదితరులు తెలిపారు.

# ఆందోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలకు ముఖ్య సమాచారం



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 26 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** ఓట్ల చోరీ వ్యవహారంలో, (సిఇసి) శ్రీ జ్ఞానేష్ కుమార్, తీసుకున్న నిర్ణయాలకు నిరసనగా, ఆయన రాజీనామా చేయాలని కోరుతూ(ఏఐసీసీ )ఇచ్చిన పిలుపుమేరకు, గౌరవ (టిపిసిసి) అధ్యక్షులు, శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, వారి ఆదేశాల మేరకు ఈనెల 28వ తేదీన నిరసన కార్యక్రమం నిర్వహించనున్నాము, మంత్రివర్యులు శ్రీ దామోదర్ రాజనర్సింహ, ఆదేశాల మేరకు, అందోల్ నియోజకవర్గం లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి, (వేదిక సంగారెడ్డి కలెక్టరేట్ ముందు ) ఉదయం 10:30 గంటలకు, సంబంధిత నాయకులు తెలియజేసే సమయానికి అందరూ సమయానికి హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరు, ఇట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి క్యాంపు కార్యాలయం సంగారెడ్డి.

# పట్లూరు గ్రామంలో శ్రీ వినాయక నిమర్జనం కార్యక్రమం శోభయాత్ర కన్నుల పండుగ



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్ 26(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూర్ గ్రామంలో కన్నుల పండుగగా వినాయక నిమజ్జన శోభాయాత్ర ప్రారంభించడం జరిగిందని తెలిపారువూరేగింపులో భజన కార్యక్రమాలు, కోలాటలు, యువకుల నృత్యాలు ముఖ్యంగా మహిళలల కోలాటలు అందరిని ఆకర్శించాయి. అంతకు ముందు వివిధ వినాయక మంట పముల దగ్గర గ్రామ పెద్దల సమక్షంలో లడ్డు వేలం పాట నిర్వాయించారు. కొండారెడ్డి



దేవాలయం వద్ద జరిగిన వేలంపాట లో అత్యధికముగా 1,05,000/- ధరతో అంశడమాకుల లక్ష్మన్ , బస్టాండ్ బాల వినాయకుని దగ్గర 90,000/- కు నరేష్, జోగిని శ్రీకాంత్ గారు, బస్టాండ్ దగ్గర 65200/- ఒగ్గు వెంకటేశం గారు, వెంకట్ ఖాజా కాలనిలో మాజి సర్పంచ్ ఇందిర అశోక్ 35,000/- హనుమాన్ వినాయకుని దగ్గర మంగలి నర్సిములు 70,000/- లకు, బాలవినాయకుని లడ్డు 36,000/-లకు చిలమమిడి లాలు, దుర్గా మాత ఆలయం వద్ద 40,000/- బండారు శంకర్ అత్యధికముగా వేలం పాటలో పాల్గొని గణేష్ లడ్డు ను కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమం లో మర్పల్లిమండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్,గ్రామ సర్పంచ్ పరుశురాం, ఉప సర్పంచ్ అఖిల్ , గ్రామ పంచాయతీ సభ్యులు మాజి సర్పంచ్ ఇందిరా అశోక్, మాజి ఎంపీటీసీ రాజు, సురేష్ ,మహేష్ , చాట్లరాకేష్, గ్రామ పెద్దలుగ్రామ ప్రజలు పాల్గొని శోభయాత్ర కార్యక్రమం ను విజయవంతంగా ముగించారు.

## ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు స్పాట్ డెడ్

ఒంగోలు సింగరాయకొండ మండలం, మూలగుంటపాడులో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరుఅక్కడికక్కడే మృతి చెందారు. విజయవాడకు ఓ కార్యక్రమానికి వెళ్తున్నప్పుడు.. అదుపు తప్పి ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టింది. ఘటన సమయంలో కారులో మొత్తం ఐదుగురు ప్రయాణికులు ఉండగా.. వారిలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మృతులు హరిప్రసాద్, విశాలాక్షిగా గుర్తించారు. క్షతగాత్రులు లావణ్య, కాన్సిత్, ప్రణశ్రీలు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని.. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. వీరంతా 5గురు ప్రయాణికులు తిరుమలలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా విధులు నిర్వర్తిస్తున్నట్టు గుర్తించారు.

# దళిత జర్నలిస్టు ఫోరం డీజే ఎఫ్ 11వ రాష్ట్ర మహాసభలకు

## ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ మాజీ జాతీయ అధ్యక్షులు చంద్రయ్యకు, ఆహ్వానం

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 26 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** దళిత జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించనున్న, అక్టోబర్ 7న సంగారెడ్డిలో జరగనున్న రాష్ట్ర 11వ మహాసభలకు, హాజరుకావాలని ఆల్ ఇండియా సమంతా సైనిక్ దళ్, మాజీ జాతీయ అధ్యక్షులు చంద్రయ్యను,ఆహ్వానించారు, దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర 11వ మహాసభల ఆహ్వానం పత్రిక కరపత్రాన్ని చంద్రయ్యకు, అందజేసి, మహాసభలకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, (డీజే ఫ్ )ఫోరం నాయకులు కోరారు, ఈ సందర్భంగా దళిత జర్నలిస్టుల సమస్యలు, హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధి, తదితర అంశాలపై మహాసభల్లో చర్చించనున్నట్లు, నాయకులు తెలిపారు, రాష్ట్రవ్యాప్తంగా దళిత జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని, మహాసభలను విజయవంతం చేయాలని వారు కోరారు, ఈ కార్యక్రమంలో దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర నాయకులు బండారి రాజు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రమణి అశోక్, ఉపాధ్యక్షులు దానం మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శంకర్, తదితరులు పాల్గొన్నారు



# రాజేంద్రనగర్ (మణికొండ) రాజకీయాల్లో కీలక పరిణామం.




**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 26 సెప్టెంబర్ 2026**భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో, రాజేంద్రనగర్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు బి. సాయిరెడ్డి, మార్కెట్ కమిటీ మరియు మాజీ ఎమ్.పి.టీ.సి డైరెక్టర్ బి. రాజు, మణికొండ మాజీ సర్పంచ్ యాలాల నరేష్, పుప్పాలగూడ మాజీ ఎమ్.పి.టీ.సి పాపాలాల్ సింగ్, మణికొండ మాజీ సర్పంచ్ బి. జైహింద్ రావు, బి. అజయ్ (మణికొండ), మణికొండ మాజీ కౌన్సిలర్ యాలాల లావణ్య, పలువురు ముఖ్య నాయకులు భారత రాష్ట్ర సమితి పార్టీలో ఆదివారం 27 సెప్టెంబర్ న శంషాబాద్ లో గల భారత రాష్ట్ర సమితి పార్టీ జిల్లా పార్టీ కార్యాలయంలో చేరనున్నారు, పరిణామం దృష్టా రాజేంద్రనగర్‌లో కొత్త రాజకీయ అధ్యాయంగా, పార్టీ బలోపేతానికి మరో కీలక అడుగుగా కొనసాగనున్నధి కావున పార్టీ కుటుంబ సభ్యులు, హితైశులు, అభిమానులు కలిసి కట్టుగా బయలు దేరడానికి ఆదివారం ఉదయం 9 గంటలకు మణికొండ మర్రి చెట్టు వద్దకు రాగలరని మనవి.

# నర్సాపూర్ పెద్దతండా లోసేవాలాల్ యూత్ లడ్డు ప్రసాదం కైవసం చేసుకున్న దా బాయ్స్ టీమ్



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్ 26 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం నర్సాపూర్ పెద్ద తండాలో పార్వతీ పరమేశ్వరుల కుమారుడు విగ్నేశ్వరుని శోభాయాత్రలో అధిక సంఖ్యలో పాల్గొని ఆటలు పాటలు నృత్యాలు భజనలుచేస్తూ అంగరంగ వైభవంగా శోభాయాత్ర నిర్వహించినట్టు పెద్దలు తెలిపారు శుభ యాత్రలో వినాయకుని హస్తాలపై ఉన్న లడ్డు ప్రసాదాన్ని గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు యువకులు, హోరాహోరీగా పోటీలో పాల్గొని వేలంపాటలో లడ్డు కైవసం చేసుకున్న ద బాయ్స్ టీమ్ కి ధన్యవాదాలు. ద బాయ్స్ టీమ్ మెంబర్ 1. సుమన్ 2. కిట్టు 3. కిరణ్ 4. అరవింద్ 5. సందీప్ 6.బళ్ళు 7. సచిన్ యువకులు పోటాపోటీగా తలపడి విఘ్నేశ్వరుని ఆశీస్సులతో యూత్ లడ్డు ప్రసాదం కైవసం చేసుకున్నట్టు తెలిపారు కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు యువకులు చెల్లెలు పెద్దలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని తెలిపారు ముఖ్యంగా ప్రారంభ దశ నుంచి ముగింపు వరకు గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు అందరూ సహకరించి ఎంతో సంతోషంగా ఆనందంగా అంగరంగ వైభవంగా పండగ జరుపుకున్నాము ఇంత సంతోషంగా ఈ పండగ జరుపుకున్నాం అంటే కేవలం సేవాలాల్ మహారాజ్ ఆశీర్వాదం విఘ్నేశ్వరుని ఆశీర్వాదంతోద యూత్ అందరూ కలిసికట్టుగా ఐక్యమత్యంతో పండుగ జరుపుకోవడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమం ప్రారంభం నుండి నిమజ్జనం వరకు సహకరించిన సచిన్, రాహుల్, జగన్ ,వినోద్ , ల కు సేవాలాల్ యూత్ ధన్యవాదాలు తెలిపారు



# ఐఎఫ్‌హెచ్‌ఈ (IFHE) మరియు కార్కినోస్ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో గోప్నరంలో క్యాన్సర్ స్క్రీనింగ్ మరియు ఆరోగ్య అవగాహన శిబిరం



**హైదరాబాద్ / గోప్నరం । సెప్టెంబర్ 26--27, 2026 (ప్రజాబలం ప్రతినిధి)**గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను మెరుగుపరచడం, ముందస్తు ఆరోగ్య అవగాహన కల్పించడం లక్ష్యంగా హైదరాబాద్‌లోని ఐసీఎఫ్ఏఐ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ (IFHE) కింద ఉన్న సెంటర్ ఫర్ ఉమెన్ డెవలప్‌మెంట్ (CWD), ఉన్నత భారత్ అభియాన్ (UBA) మరియు కార్కినోస్ హెల్త్‌కేర్ సంయుప్తంగా రెండు రోజుల 'కమ్యూనిటీ







మెడికల్ వెల్‌నెస్ అండ్ క్యాన్సర్ అవేర్‌నెస్ డ్రైవ్'ను గోప్నరం గ్రామంలో నిర్వహించాయి. ఈ కార్యక్రమాన్ని ఐఎఫ్‌హెచ్‌ఈ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎ. వినయ్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. విజయలక్ష్మి లు ఘనంగా ప్రారంభించారు. రిలయన్స్–కార్కినోస్ హెల్త్‌కేర్ సీనియర్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్ట్, టాటా క్యాన్సర్ సెంటర్ (తిరుపతి) మాజీ డైరెక్టర్ డాక్టర్ నారాయణ మూర్తి పోదూరి నేతృత్వంలోని వైద్య నిపుణుల బృందం ఈ శిబిరంలో పాల్గొంది.

ఈ కార్యక్రమంలో ఖదీూ ఈవెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ అంజన్న మట్ట, జాయింట్ రిజిస్ట్రార్ వి. మధుసూదన్ రావు, మురళీధరన్ పసుల, అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ కర్నల్ జయంత సర్కార్, అలాగే ఇతర అధ్యాపకులు, వైద్య నిపుణులు పాల్గొన్నారు.

ముఖ్య ముఖ్యాంశాలు (Key Highlights):

పాల్గొన్న గ్రామాలు: ఐఎఫ్‌హెచ్‌ఈ దత్తత తీసుకున్న ఐదు గ్రామాలైన గోప్నరం, మహారాజ్‌పేట్, పిల్లిగుడ్ల, ప్రొద్దుటూర్, దొంతంపల్లి మరియు సమీప తాండాల నుంచి మొదటి రోజు 150 మందికి పైగా గ్రామస్తులు ఉచిత వైద్య సలహాలు, ఆరోగ్య పరీక్షలు మరియు క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలను పొందారు.

నిర్వహణ సమయం: సెప్టెంబర్ 26న ప్రారంభమైన ఈ శిబిరం, సెప్టెంబర్ 27న ఉదయం 10:00 గావీ నుండి సాయంత్రం 5:00గావీ వరకు కొనసాగింది.

ఉచిత సేవలు: ఇండియన్ క్యాన్సర్ సొసైటీ (బెంగళూరు) ప్రధాన ఆర్థిక భాగస్వామిగా వ్యవహరించగా, ఈ కార్యక్రమం పూర్తిగా ఉచితంగా (Zero-cost model) నిర్వహించబడింది. కార్కినోస్ హెల్త్‌కేర్ సాంకేతిక మరియు క్లినికల్ భాగస్వామిగా సేవలను అందించింది. సేవలు: క్యాన్సర్ అవగాహన, ముందస్తు గుర్తింపు, సాధారణ ఆరోగ్య పరీక్షలు, వైద్య సలహాలు మరియు తదుపరి చికిత్స అవసరమైన వారికి రెఫరల్ సపోర్ట్ అందించడం ఈ శిబిర ముఖ్య ఉద్దేశం. ఈ సందర్భంగా డాక్టర్ నారాయణ మూర్తి పోదూరి మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయిలో మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, అందరికీ అందుబాటులో ఉండే క్యాన్సర్ సంరక్షణను అందించడంలో ఐఎఫ్‌హెచ్‌తో భాగస్వామ్యం కావడం సంతోషకరమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక బాధ్యతను నిర్వర్తించడంలో విద్యా సంస్థల పాత్ర ఎంతో కీలకమని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య అసమానతలను తొలగించడంలో విద్యా సంస్థలు, వైద్య సంస్థలు, స్థానిక నాయకుల భాగస్వామ్యం ఎంతగానో దోహదపడుతుందని ఐఎఫ్‌హెచ్‌ఈ ప్రతినిధులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# రెండో '95' లక్ష్య సాధనపై ప్రత్యేక దృష్టి

## మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో టీజీఎస్‌ఏసీఎస్ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ డా. రాజేశం సమీక్ష

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం సెప్టెంబర్ 26:** హెచ్ఐవీ నియంత్రణలో భాగంగా నిర్దేశించిన 95-95-99 లక్ష్యాల సాధనకు క్షేత్రస్థాయిలో మరింత సమన్వయంతో పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (టీజీఎస్ఏసీఎస్) అదనపు ప్రాజెక్టు డైరెక్టర్, క్షయవ్యాధి కార్యక్రమ రాష్ట్ర సంయుక్త సంచాలకుడు డా. ఏ. రాజేశం సూచించారు. సేవల పర్యవేక్షణ, అంచనా కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిని ఆయన సందర్శించి హెచ్ఐవీ, క్షయవ్యాధి సేవల అమలు తీరును సమీక్షించారు.

ఆసుపత్రిలోని హెచ్ఐవీ సమగ్ర సలహా, పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన ఆయన సంబంధిత రికార్డులు, నమోదు పుస్తకాలు, పనితీరు వివరాలను పరిశీలించారు. నెలవారీగా నిర్వహిస్తున్న హెచ్ఐవీ పరీక్షలు, గుర్తిస్తున్న పాజిటివ్ కేసుల వివరాలను తెలుసుకున్నారు. కొత్తగా హెచ్ఐవీ నిర్ధారణ అయిన వారిని వైరస్ నిరోధక చికిత్స కేంద్రాలకు అనుసంధానిస్తున్న తీరును పరిశీలించారు.

హెచ్ఐవీ--క్షయవ్యాధి పరస్పర సూచన విధానాన్ని కూడా సమీక్షించారు. హెచ్ఐవీ పరీక్ష కేంద్రం నుంచి క్షయవ్యాధి నిర్ధారణ కేంద్రానికి, అక్కడి నుంచి తిరిగి హెచ్ఐవీ పరీక్ష కేంద్రానికి జరుగుతున్న సూచనలు, అనుసంధానాలు, లబ్ధిదారుల తదుపరి పర్యవేక్షణ వివరాలను పరిశీలించారు.

క్షయవ్యాధి సేవలపై సమీక్షలి

అనంతరం క్షయవ్యాధి నిర్ధారణ కేంద్రాన్ని సందర్శించిన డా. రాజేశం.. రికార్డులు, నమోదు పుస్తకాలను పరిశీలించారు. హెచ్ఐవీ--క్షయవ్యాధి రెండు వ్యాధులతో బాధపడుతున్న వారి చికిత్స, తదుపరి



పర్యవేక్షణ, చికిత్స కొనసాగింపు వివరాలను సమీక్షించారు. అర్హులైన హెచ్ఐవీ బాధితులకు నిర్వహిస్తున్న వైరస్ పరిమాణ పరీక్షలు, వైరస్ నియంత్రణ స్థితిని కూడా పరిశీలించారు.

రక్తనిధిలోనూ పరిశీలనలి

ఆసుపత్రిలోని రక్తనిధిని సందర్శించిన ఆయన స్వచ్ఛంద రక్తదానాల సేకరణ, రక్త పరీక్షల వివరాలను పరిశీలించారు. ముఖ్యంగా హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షలపై ఆరా తీశారు. పరీక్షల్లో హెచ్ఐవీ పాజిటివ్‌గా తేలిన వారిని చికిత్సకు అనుసంధానించడం, తదుపరి పర్యవేక్షణ చేస్తున్న తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

రెండో '95'లో అంతరాన్ని తగ్గించాలిలి

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఇప్పటికే తొలి '95', మూడో '95' లక్ష్యాలను సాధించిందని, ప్రస్తుతం రెండో '95' లక్ష్యంలో ఉన్న అంతరాన్ని తగ్గించడంపై ప్రధానంగా దృష్టి పెట్టాలని డా. రాజేశం సూచించారు. గుర్తించిన హెచ్ఐవీ బాధితులను చికిత్సకు అనుసంధానించడంతో పాటు వారు క్రమం తప్పకుండా చికిత్స పొందుతున్నారో లేదో నిర్ధారించాలని తెలిపారు.

జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు, ప్రైవేటు ఆరోగ్య సంస్థలను జిల్లా బృందం సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న హెచ్ఐవీ బాధితుల వివరాలను సేకరించాలని సూచించారు. అవసరమైన వారిని సంబంధిత ప్రభుత్వ కార్యక్రమ సేవలకు అనుసంధానించడంతో పాటు చికిత్స కొనసాగింపు, తదుపరి పర్యవేక్షణను బలోపేతం చేయాలని పేర్కొన్నారు.

ఖచ్చితమైన నమోదు, సకాలంలో సూచనలు, ఆసుపత్రుల మధ్య సమన్వయం, నిరంతర పర్యవేక్షణతో అర్హులైన ప్రతి ఒక్కరికీ అవసరమైన హెచ్ఐవీ, క్షయవ్యాధి సేవలు అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు.

ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో సంయోజకుడు శ్రీ బాబు రావు, కార్యక్రమ అధికారి డా. వై. శ్రీదేవి, ఆసుపత్రి వైద్య పర్యవేక్షకురాలు డా. రాధ, ఆర్ఎంఓ డా. మాధురి, ప్రజా సంబంధాల అధికారి డా. పి. వినోద్, సంజీవ్, రమేష్, కల్పనతో పాటు క్షయవ్యాధి కార్యక్రమ సిబ్బంది పాల్గొన్నారు.

# మిడ్ మానేరు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి,( సెప్టెంబర్ 26):** మిడ్ మానేరు ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు డిమాండ్ చేశారు. మొత్తం 10,683 నిర్వాసిత కుటుంబాల్లో 4,696 కుటుంబాలకు ఇంకా ఇళ్లు అవసరమన్నారు. గతంలో ప్రకటించిన రూ.270 కోట్ల నిధులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.

సంకేపల్లిలో పునరావాసం కోసం ఎదురుచూస్తున్న 45 కుటుంబాలకు న్యాయం చేయాలని, పెండింగ్‌లో ఉన్న పరిహారం, పునరావాస సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ముంపు గ్రామాల్లో యువత, మహిళలకు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని కోరారు. ఈ నెల 30న సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్ల పర్యటన సందర్భంగా నిర్వాసితుల సమస్యలపై స్పష్టమైన ప్రకటనతో పాటు కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రకటించాలని చల్మెడ లక్ష్మీ నరసింహారావు డిమాండ్ చేశారు

# హత్య కేసులో సత్వర న్యాయం..

## పోలీసులకు బాధిత కుటుంబం కృతజ్ఞతలు



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి,( సెప్టెంబర్ 26)**వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన హత్య కేసులో నిందితుడు కోరేపు రాజ్‌కుమార్‌కు న్యాయస్థానం జీవిత ఖైదు జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించింది. కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి న్యాయం జరిగేలా కృషి చేసిన పోలీసులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వేములవాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. జిల్లా ఎస్పీతో పాటు పోలీసు అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు

# భక్తిశ్రద్ధలతో గణేశుడి శోభాయాత్ర..

## అన్నదానంలో పాల్గొన్న మట్టా దయానంద్ విజయకుమార్



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 26:** పెనుబల్లి మండలం కొత్త కారాయిగూడెం గ్రామంలో శ్రీ గణేశుడి శోభాయాత్ర, అన్నదాన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన శ్రీ గణేశుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజలతో కలిసి శోభాయాత్రలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని అందించారు.

గ్రామంలో గణేశుడి శోభాయాత్ర భక్తుల కోలాహలం మధ్య ఉత్సాహంగా సాగింది. అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో కొనసాగాయి.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పరాయి మహిళలతో భర్త డ్యాన్స్

## కోపంతో భార్య ఆత్మహత్య

మంచిర్యాల వినాయక నిమజ్జనం ఉత్సవాలు ఒక వివాహిత ఆత్మహత్యకు దారి తీసాయి. కాసిపేట మండలం, దొడ్డిగూడెంలో ఘటన జరిగాయి. సోనాపూర్ బాదుగూడకు చెందిన సంధ్య(23)కు జంగుతో పెళ్లి నాలుగేళ్ల క్రితం జరిగింది. తాజాగా బుధవారం నాడు గ్రామంలో నిర్వహించిన వినాయక నిమజ్జన వేడుకల్లో భాగంగా జంగు మహిళలతో కలిసి డ్యాన్స్ చేసాడు. తన ముందే భర్త ఇతర మహిళలతో డ్యాన్స్ చేయడాన్ని తట్టుకోలేక భార్య సంధ్య తీవ్ర మనోవేదనకు గురైయింది. ఆ బాధలోనే గురువారం ఇంట్లో పురుగుల మందు తాగింది. మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం కన్నుమూసింది.

# 2న నగరంలో గ్రాండ్ 5కే వాకథాన్




**హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ప్రజాబలం ప్రతినిధి:** 40 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసినసమావేశంలో వాకర్స్ అంతర్జాతీయ చైర్ పర్సన్‌సుంకర కృష్ణకుమారి, అధ్యక్షులు కే.రామానందం,నాగభూషణం, ఎస్ మురళీకృష్ణ, వై శ్రీనివాసచారి,సంపత్ రెడ్డి లు ఇందుకు సంబంధించిన పోస్టర్ని ఆవిష్కరించి మాట్లాడారు..

నిత్యం నడక వల్ల కలిగే ప్రయోజనాలను నగర ప్రజలకు వివరించే నిమిత్తం అక్టోబర్ 2 జాతిపిత గాంధీ మహాత్ముని జయంతి రోజున నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజాలో గ్రాండ్ 5కే వాకథాన్ ను నిర్వహిస్తున్నట్లు వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రకటించింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో వాకథాన్ కు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రారంభించి 40 వసంతాలు పూర్తి చేసుకువన్న సందర్భంగా నడక ప్రాధాన్యతను ప్రతి ఒక్కరికి వివరించే లక్ష్యంతో 5కే వాకతాన్ ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీపుల్స్ ప్లాజాలో ఉదయం 6 గంటలకు వాక్ ప్రారంభమవుతుందని తెలిపారు. సుమారు 1000 మందికి పైగా ఈ వాక్ లో పాల్గొంటారని చెప్పారు.ఈ కార్యాలయంలో కార్యక్రమ నిర్వాహకులుమాధవరావు,విజయ లక్ష్మీ,శైలజ మోహన్,గోవింద, మహిపాల్ రెడ్డిలు పాల్గొన్నారు.

# మంత్రి హామీతో రైస్ మిల్లర్ల సమ్మె విరమణ

## రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్




**హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ప్రజాబలం ప్రతినిధి:** రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంతోపాటు ప్రభుత్వ వేధింపులను తక్షణమే నిలిపియాలని డిమాండ్ చేస్తూ గత కొంతకాలంగా కొనసాగుతున్న సమ్మెను విరమిస్తున్నట్లు రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రకటించింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ నాయకులు రఫీ, గణపతి రెడ్డి, వీరేశం లు మాట్లాడారు. 13 డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మొదట నిరసన వ్యక్తం చేసి అనంతరం మిల్లులకు తాళాలు వేసి సమ్మె ప్రారంభించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వంతో పలుమార్లు చర్చలు జరిపిన ప్రయోజనం లేకపోవడంతో రిలే నిరాహార దీక్షలు సిద్ధపడ్డట్లు తెలిపారు. శనివారం పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమక్షంలో జరిగిన చర్చల్లో ప్రధాన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మెను విరమిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా మిల్లులు యధావిధిగా కొనసాగుతాయని చెప్పారు.



# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం.

## సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 26:** తెలంగాణ రైతాంగ పోరాట వీరనారి, ధీరవనిత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు.

చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను రజక సంఘం సత్తుపల్లి పట్టణ అధ్యక్షుడు వీరవాడ నాగభూషం ఆధ్వర్యంలో వేంసూర్ రోడ్డులోని దోబీఘాట్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాగమయి దయానంద్.. చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ కేవలం ఒక వర్గానికి చెందిన నాయకురాలు కాదని, అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. భూస్వామ్య దోపిడీ, అన్యాయానికి వ్యతిరేకంగా ఆమె ప్రదర్శించిన ధైర్యం, తెగువ, పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

రజకులు, బీసీ వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. చాకలి ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ తెలంగాణ మహిళా శక్తికి, ఆత్మగౌరవ పోరాటానికి గొప్ప ప్రతీక అని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన ఐలమ్మ చరిత్రను ప్రతి కుటుంబం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రహేనా బేగం కమల్ పాషా, కాంగ్రెస్ పార్టీ సత్తుపల్లి పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు, కౌన్సిలర్లు శరత్ చంద్ర, మట్టా ప్రసాద్, వీరవాడ అపర్ణ, దేవి స్వీట్స్ శ్రీను, షరీఫ్, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, రిటైర్డ్ ఉద్యోగ సంఘాల నాయకులు గుండాల కృష్ణయ్య, సుబ్బారావు, రజక సంఘం నాయకులు కోట సత్యనారాయణ, పంతంగి నరసింహారావు, రామ్మూర్తి, టోపీ శ్రీను, రాయల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అక్షరాభ్యాసం.. శ్రీమంతంతో సందడిగా అంగన్వాడీ కేంద్రం



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 26:** వేంసూరు పరిధిలోని అంబేద్కర్‌నగర్ అంగన్వాడీ కేంద్రంలో శనివారం అక్షరాభ్యాసం, శ్రీమంతం వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారుల కేరింతలు, సాంప్రదాయ వేడుకలతో అంగన్వాడీ కేంద్రం సందడిగా మారింది.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేంసూరు సర్పంచ్ ఎండీ. ఫకృద్దీన్ హాజరై మాట్లాడారు. అంగన్వాడీ సీడీపీఓ సత్యవతి, సూపర్‌వైజర్ కమల చిన్నారులకు పలక, బలపాలు అందించి అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం గర్భిణులకు సంప్రదాయబద్ధంగా శ్రీమంతం నిర్వహించి పండ్లు, తాంబూలాలు అందజేశారు.



ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాలు చిన్నారుల్లో ప్రాథమిక విద్యకు పునాది వేయడంతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పోషణపై అవగాహన కల్పించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.

కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఈద కొండల్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెల్లి నరసింహాస్వామి, వార్డు మెంబర్ పిల్లి రమణ, అంగన్వాడీ సిబ్బంది, హెల్త్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధులు, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# 1995 రోజులుగా నిరంతర అన్నదాన సేవలు





**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి (సెప్టెంబర్-26)** భీమేశ్వర ఆలయం వద్ద మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో కొనసాగుతున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా శనివారం సుమారు 200 మంది పేదలు, అన్నార్తులు, భక్తులకు అన్నదానంతో పాటు స్వీట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో 1995 రోజులుగా నిరంతరంగా అన్నదాన సేవలు కొనసాగుతున్నాయి.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ కౌన్సిలర్ ఇప్పపూల అజయ్ మాట్లాడుతూ అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని, కరోనా కష్టకాలం నుంచి ట్రస్ట్ సభ్యులు దాతల సహకారంతో నిరంతరం సేవలు అందించడం అభినందనీయమన్నారు. తాను కూడా ట్రస్ట్‌లో సభ్యుడిగా ఉండటం గర్వంగా ఉందన్నారు.ట్రస్ట్ నిర్వాహకులు మధు మహేష్ మాట్లాడుతూ పేదలకు కనీసం ఒక్కపూటైనా కడుపునిండా భోజనం అందించేందుకు దాతలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు తదితర శుభకార్యాల సందర్భంగా అన్నదానం చేయదలచిన వారు 9246939388 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సగ్గు రాహుల్, పసుల శ్రీధర్, గొండ ప్రసాద్, మధు, కవిత, గొట్టం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఖైరతాబాద్ చుట్టూ రాజకీయాలు



హైదరాబాద్, సెప్టెంబర్ 26 తెలంగాణ రాజకీయాలకు ఇప్పుడు ఖైరతాబాద్ నియోజకవర్గం కేంద్ర బిందువుగా మారింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వేటు పడడంతో అక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. ఇది అధికార కాంగ్రెస్ పార్టీకి అత్యంత కీలకంగా మారింది. జీహెచ్ఎంసీ పరిధిలో పట్టు సాధించేందుకు కాంగ్రెస్ పార్టీకి ఇది సరికొత్త రాజకీయ అవకాశాన్ని ఇస్తోంది.2023 శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచిన దానం నాగేందర్, ఆ తర్వాత రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ గూటికి చేరారు. అయితే ఫిరాయింపుల చట్టం వల్ల ఆయన తన ఎమ్మెల్యే పదవిని కోల్పోవాల్సి వచ్చింది. ఇప్పుడు ఈ నియోజకవర్గంలో జరగబోయే ఉపఎన్నిక కేవలం ఒక స్థానానికి పరిమితం కాలేదు. గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతంలో పార్టీ సంస్థాగత బలాన్ని పెంచుకోవడానికి, అలాగే బీఆర్ఎస్ బలమైన పునాదులను దెబ్బతీయడానికి కాంగ్రెస్‌కు ఇది పెద్ద అవకాశంగా చెప్పవచ్చు.ఖైరతాబాద్ ఉపఎన్నికలో దానం నాగేందర్ మరోసారి పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఒకవేళ ఆయన గెలిస్తే, కేబినెట్ విస్తరణలో ఆయనకు మంత్రి పదవి దక్కే అవకాశాలు ఉన్నాయన్న చర్చ జోరుగా సాగుతోంది. ఇది కాంగ్రెస్ పార్టీకి రెండు ప్రయోజనాలను కల్పించే అవకాశం ఉంది. ఒకటి.. హైదరాబాద్ నగరానికి రాష్ట్ర మంత్రివర్గంలో బలమైన ప్రాతినిధ్యం లభిస్తుంది. రెండు.. మున్నూరు కాపు సామాజిక వర్గానికి మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించినట్లవుతుంది. ప్రస్తుతం కేబినెట్లో ఈ సామాజిక వర్గానికి మంత్రి పదవి లేదు. కొండా సురేఖ తొలగింపు తర్వాత తలెత్తిన రాజకీయ శూన్యతను పూడ్చడానికి ఈ పరిణామం ఉపయోగపడవచ్చు.మరోవైపు ఈ ఉపఎన్నిక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వానికి పెద్ద పరీక్షగా నిలవనుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి నగరంలో ఆశించిన స్థాయిలో సీట్లు రాలేదు. ఆ తర్వాత జరిగిన సికింద్రాబాద్ కంటోన్మెంట్,, జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందింది. అయినా.. హైదరాబాద్ రాజకీయాలపై పట్టు సాధించాల్సిన అవసరం సీఎం రేవంత్ రెడ్డికి ఉంది.మరోవైపు.. గతంలో బీఆర్ఎస్‌తో ఎన్నికల అవగాహన కలిగి ఉన్న మజ్లిస్ పార్టీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పలు అంశాల్లో సమర్థిస్తోంది. ఈ మారుతున్న రాజకీయ సమీకరణాల మధ్య.. ఖైరతాబాద్ గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ ఎలాంటి వ్యూహాలు రచిస్తుంది.. అనేది వేచి చూడాలి. ఏది ఏమైనప్పటికీ.. ఖైరతాబాద్ ఉపఎన్నిక ఫలితం తెలంగాణ

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com